2న ఏకలవ్య పాఠశాలలు ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు: గిరిపుత్రులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను అక్టోబరు 2 వ తేదీన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని ఐటిడిఏ పి.ఓ. వి.అభిషేక్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పర్చువల్ గా పెదబయలు, అరకువ్యాలీ మండలాల్లో రూ. 40 కోట్లతో వ్యయంతో నిర్మించిన పాఠశాలలను ప్రారంభిస్తారని అన్నారు. చింతపల్లి, హుకుంపేట మండలాల్లో రూ.40 కోట్లతో నిర్మించనున్న ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణాలకు ప్రధాన మంత్రి భూమి పూజ చేస్తారని చెప్పారు. అనంతరం అరకు వ్యాలీ మండలం పకనకుడి గ్రామంలో రెండవ విడత జన్ మన్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అక్కడ ఆదివాసీ గిరిజనులతో ప్రధాని వర్చువల్ గా సంభాషిస్తారని తెలియ జేసారు. జన్ మన్ కార్యక్రమంలో పి.వి.టి.జి గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని అన్నారు.

మినీ అంగన్వాడీ కేంద్రాలను

మెయిన్ కేంద్రాలుగా మార్చండి

- ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్పు చేయాలని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. గురువారం అరకులోయలో ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయం జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. అనంతరం ఆమె మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో అంగన్వాడీలు 42 రోజులు సమ్మె చేపట్టారని, దీంతో సమ్మెలో ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంతంలో అంగన్వాడీ సెంటర్లకు పప్పు, మంచి నూనె వంటి సరుకులు సకాలంలో అందలేదన్నారు. వేతనాలు కూడా పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. బాలమృతం ఇతర సరుకులు సెంటర్ వద్దకే చేర్చాలన్నారు.సరుకులు మండల కేంద్రం వద్ద ఉండటంతో అంగన్వాడీలు వందల రూపాయలు పెట్టి ఆటోల్లో సెంటర్‌కు తీసుకెళ్లడంతో అదనపు భారం పడుతుందని తెలిపారు. రిటర్మెంట్ అయిన కొంతమంది అంగన్వాడి సహాయకులకు 50 వేలు అందాల్సిన బెనిఫిట్స్ 30 వేలు అందుతున్నాయని తెలిపారు. అంగన్వాడి సెంటర్‌లకు ఇచ్చిన సెల్ ఫోన్లు సక్రమంగా పనిచేయక అంగన్వాడీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

తక్షణం అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ కళావతి, కొండమ్మ, ఈశ్వరమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన మెనూ అమలు

-ఐటిడిఎ పిఒ అభిషేక్

సమావేశంలో మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన మెనూ అమలు చేయాలని ఐటిడిఏ పిఒ వి. అభిషేక్ ఆదేశించారు. ఐటిడి సమావేశ మందిరంలో 11 మండలాల ఎటిడబ్ల్యూఓలు, ప్రధానోపాధ్యాయలు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో గురువారం విద్యా, వైద్యం, మెనూ అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆశ్రమ పాఠశాలలకు నాణ్యమైన నిత్యావసర సరుకులు సరఫరాకు టెండరు ఖరారు చేసామని చెప్పారు. సరుకుల సరఫరాలో నాణ్యత లేకపోతే తిరస్కరించాలని సూచించారు. పామాయిల్‌కి బదులు సన్ ఫ్లవర్ ఆయిల్ సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన మెనూ అందిస్తే ఆరోగ్య సమస్యలు ఉండవన్నారు.విద్యార్థులకు ఆరోగ్య సమస్యలుంటే వెంటనే ఆసుపత్రి తరలించి వైద్యం అందించాలని సూచించారు. పాఠశాలల్లో బేస్లైన్ పరీక్షలు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను బట్టి ఎ బి సి డి కేటగిరీలుగా విభజించి సి డి కేటగిరీ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మూడవ తరగతి పాఠ్యాంశాలను పది విద్యార్థులు చదవ లేక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసారు. ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేకంగా సిక్ రూం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అనారోగ్య సమస్యలుంటే సిక్రూంలో ఉంచి ఒక పూట గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించాలని చెప్పారు. దీర్ఘకాల ఆరోగ్య సమస్యలుంటే తన దృష్టికి తీసుకుని వస్తే విశాఖపట్నం తరలించి వైద్యం అందిస్తామన్నారు. ప్రతీ నెలా మూడవ శనివారం శ్రమదానంతో మనబడి పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించి పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాలికల ఆశ్రమ పాఠశాలల నుండి తల్లిదండ్రులతో మాత్రమే బయటకు పంపించాలని చెప్పారు.స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల హాజరు పర్యవేక్షించాలని చెప్పారు. కెరీర్ గైడెన్స్ పై ఉపాధ్యాయులుకు శిక్షణ అందిస్తామన్నారు. ప్రకాశం జిల్లా నుండి మార్గదర్శి అనే కెరీర్ గైడెన్స్ సంస్థ ఆధ్వర్యం రంపచోడవరంలో శిక్షణ అందించడానికి చర్యలు చేపట్టామన్నారు. ప్రతీ మండలం నుండి ఇద్దరు ఉపాధ్యాయులకు శిక్షణ అందించి అనంతరం వారితో మిగిలిన ఉపాధ్యాయులకు కెరీర్ గైడెన్స్ శిక్షణ ఇస్తామని చెప్పారు.ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఇంచార్జి ఉప సంచాలకులు రజని, సహాయ గిరిజన సంక్షేమాధికారులు, 11 మండలాల ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సప్పర్లలో మెగా వైద్య శిబిరం

- 200 మందికి ఉచిత వైద్య సేవలు, మందులు పంపిణీ

- ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిర్వహణ

గాలికొండ పంచాయతీ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, ప్రజారోగ్య వేదిక, సంఘాల ప్రతినిధులు

ప్రజాశక్తి సీలేరు

జికే.వీధి మండలం గాలికొండ పంచాయితీ పరిధి సప్పర్లలో గ్రామంలో ప్రజారోగ్య వేదిక, శారద ట్రస్ట్, అల్లూరి విజ్ఞాన కేంద్రం, మెడికవర్ సహకారంతో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఇటీవల కొండచరియలు విరిగిపడిన చట్రాపల్లితో పాటు సమీపంలోని జంపర్ లోవ, నిమ్మగొంది, గాలికొండ, ఎర్రగడ్డ, ఆకులూరు, పలసల బంద, నిమ్మగొంది గ్రామాల ప్రజలు 200 మంది ఈ వైద్య శిబిరానికి హాజరయ్యారు. వారికి మెడికవర్ వైద్యులు డాక్టర్ జి భాగ్యరాజు (పిజిషియన్), డాక్టర్ శ్రవణ్ కుమార్ (గుండె వైద్య నిపణులు), వి కిరణ్ కుమార్ (కో ఆర్డినేటర్) సిబ్బంది బీపీ, షుగర్, ఈసీజీజీ వంటి పరీక్షలు నిర్వహించారు. జ్వరం, తలనొప్పి, ఒళ్ళునొప్పులు, కీళ్లనొప్పులు, చర్మవ్యాధులు, కడుపు మంటలకు వైద్యం చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర నాయకులు కామేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాలకు చట్రాపల్లి గ్రామంలో ఆరు ఇల్లు కొట్టుకుపోయి ఒక మహిళ మృతి చెందగా, ముగ్గురు గాయాలపాలయ్యారని తెలిపారు. వరదల్లో 70 మేకలు, 8 పశువులు, వందల సంఖ్యలో కోళ్లు చనిపోయి బాధితులు తీవ్ర నష్టానికి, ఇబ్బందులకు గురయ్యారని చెప్పారు. వారిని ఆదుకునేందుకు ఆదివాసీ గిరిజన సంఘం మెగా వైద్య శిబిరాలతో పాటు రగ్గులు, నిత్యవసర సరుకులు పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు, ఆదివాసీ గిరిజన సంఘం జికె.వీధి మండల కార్యదర్శి కొర్ర బాలయ్య, సిఐటియు మండల కార్యదర్శి జి.సత్యనారాయణ, గాలికొండ మాజీ సర్పంచ్ గమ్మెల మల్లేశ్వరి, నాయకులు చంద్రరావు, ఆశా కార్యకర్తలు సత్యవతి, రుక్మిణి, కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన వైద్యులు, ఆయా సంస్థల ప్రతినిధులకు భోజన, వసతి సౌకర్యాలను సిఐటియు సీలేరు బ్రాంచి గౌరవాధ్యక్షులు ఎస్‌కె.సుబాన్, బ్రాంచి అధ్యక్షులు బి.లక్ష్మణ్, కార్యదర్శి టి.విష్ణు కుమార్, సిఐటియు కన్వీనర్ ఎంవి.రమణ, ఎపి జెన్కో కాంట్రాక్టు కార్మికులు కల్పించారు.

నేడు దారకొండలో...

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన జికె.వీధి మండలం దారకొండలో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు నారాయణ, సన్యాసిరావు తెలిపారు. దారకొండ, గుమ్మిరేవుల పంచాయతీల పరిధిలోని గ్రామాల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు గురువారం వారు వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు.

మహిళా సంఘాల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ఏపీవో జనరల్ డిఎన్‌వి.రమణ పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏడు మండలాల డిపిఎంలు, ఏపిఎంలతో వెలుగు ఎపిడి డేగలయ్యతో కలిసి ఐటిడిఎ ఎపిఒ రమణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాల్లో ఎన్ని మహిళా సంఘాలు, ఎంతమంది సభ్యులు ఉన్నది మండలాల వారిగా ఆరా తీశారు. మహిళా సంఘాలు బ్యాంకుల ద్వారా తీసుకున్న అప్పులను సకాలంలో తీర్చే విధంగా వారితో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరారు. శ్రీనిధి ఎప్పటికప్పుడు కట్టించాలన్నారు. మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు మంజూరు చేయించే బాధ్యత సంబంధిత ఏపీఎంలపై ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపియంలు అపర్ణ, పరమేశ్వరరావు, కిషోర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ ఎపిఒ రమణ

ఉత్సాహంగా యుటిఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- అనంతగిరి:క్రీడా పోటీలలో ఉపాధ్యాయులు ఉత్తేజంతో పాల్గొనడం సంతోషకరమని స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు, ఎంపీపీ శెట్టి నీలవేణి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మిలు అన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల యూటీఎఫ్ నేతృత్వాన శివలింగపురం బాలుర పాఠశాల వద్ద రెండు రోజులుగా జరిగే ఈ పోటీలు గురువారం యూటిఎఫ్ మండల అధ్యక్షులు వివి ఈశ్వరరావు అధ్యక్షతన పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ పోటీలో విజయం సాధించి రాష్ట్ర స్థాయి వరకు చేరి మండలానికి పేరు తేవాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ ముందుండి పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సార సీతయ్య, యుటిఎఫ్ ఉమ్మడి జిల్లా సహాధ్యక్షులు శెట్టి రాంబాబు, మండల కార్యదర్శి సింహాచలం, అల్లూరి జిల్లా అధ్యక్షులు బుడిగి దేముడు. సీనియర్ నాయకులు గుజ్జుల కొండబాబు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పిటిసి, ఎంపిపి, తదితరులు

ప్రారంభిస్తున్న శ్రీకంఠనాథరెడ్డి

ఎకో టూరిజం ప్రాజెక్ట్ ప్రారంభం

ప్రజాశక్తి-చింతపల్లి: ప్రకృతి అందాలను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా అటవీ శాఖ కృషి చేస్తుందని ఆ శాఖ ముఖ్య సంరక్షణ అధికారి ఎస్ శ్రీకంఠనాథ రెడ్డి అన్నారు. ఆంధ్ర కశ్మీర్ గా పేరుందిన లంబసింగి ప్రాంతంలోని పెద బరడ పంచాయతీ కృష్ణాపురం గ్రామ సమీపంలోని పైన్ తోటల వద్ద అభివృద్ధి పరచిన ఎకో టూరిజం ప్రాజెక్టును స్థానిక డివిజనల్ అటవీ శాఖ అధికారి సిహెచ్ సూర్యనారాయణతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఎకో టూరిజం ప్రాజెక్ట్‌లో కల్పించిన సదుపాయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన్య ప్రాంతంలో అటవీ సంపద పుష్కలంగా ఉందన్నారు. పర్యాటక ప్రదేశాలు త్వరలోనే మరిన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. 25 హెక్టార్ల విస్తీర్ణంలో అభివృద్ధి పరుస్తున్న ఈ ఎకో టూరిజం ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకు రావడానికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందన్నారు. దీని ద్వారా గ్రామంలోని యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పర్యాటకులు రాత్రిపూట ఈ ప్రాంతంలో ఉండేందుకు టెంట్లు ఏర్పాటు చేయడమే గాక, వారికి అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మీ కోసం రద్దు

ప్రజాశక్తి-పాడేరు: ఈనెల 27వ తేదీ శుక్రవారం జరగనున్న మీకోసం కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఫిర్యాదుదారులకు ఎటువంటి సమస్య లేకుండా ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ప్రకటించారు. ఫిర్యాదులు అందజేయడానికి రావద్దని విజ్ఞప్తి చేశారు.

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

ప్రజాశక్తి-పాడేరు:కలక్టరేట్ సమావేశ మందిరంలో ఈ నెల 27న శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక మండలి అధ్యక్షులు, కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక తలారిసింగి కూడలి నుండి కలెక్టరేట్ వరకు గిరిజన జానపద నృత్యాలు, సంగీత వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహిస్తామని, అనంతరం సమావేశ మందిరంలో జ్యోతి ప్రజ్వలనతో వేడుకలు జరుగుతాయని తెలిపారు. అతిథుల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం పర్యాటకంపై నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం, యువ టూరిజం కో-ఆర్డినేటర్లకు ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు.

వైసిపి జిల్లా అధ్యక్షునిగా విశ్వేశ్వర రాజు

ప్రజాశక్తి -పాడేరు: వైసిపి అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షుడిగా మత్స్యరాస విశ్వేశ్వరరాజును నియమించారు. ఈ మేరకు గురువారం ఈ పార్టీ: కేంద్ర కార్యాలయం నుంచి వివిధ జిల్లా అధ్యక్షుల నియామకంపై ప్రకటన వెలువడింది. ఇప్పటివరకు అల్లూరి జిల్లా అధ్యక్షురాలిగా గత ఎన్నికల ముందు నుంచి కొనసాగిన పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని పిఏసి సభ్యురాలిగా పార్టీ రాష్ట్ర ఎస్టీసెల్ విభాగం అధ్యక్షురాలిగా నియమించారు.

విరిగి పడిన కొండ చరియలు

ప్రజాశక్తి-అనంతగిరి రూరల్:మండలంలో మారు మూల చివారు పంచాయతీ పినకోట రహదారిలో కొండ చరియ విరిగిపడింది. దీంతో, పినకోట రహదారి మార్గాన ట్రాఫిక్ అంతరాయం ఏర్పడిందని పినకోట సర్పంచ్ ఎస్ గణేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పినకోట రహదారిలో కొండ చరియలు విరిగి పడ్డాయన్నారు. రోడ్లపై విరిగిపడిన కొండ చరియ లను తొలగించామన్నారు.

తొలగిస్తున్న గ్రామస్తులు

మెనూ సక్రమంగా అమలు చేయాలి

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

డిజిటల్ విద్యపై అడిగి తెలుసుకుంటున్న ఐటిడిఎ పిఒ సింహాచలం, చిత్రంలో సబ్ కలెక్టర్ కల్పశ్రీ తదితరులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఏజెన్సీలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ సక్రమంగా అమలు చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీతో కలిసి ఐటిడిఎ పిఒ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యా బోధనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే వరకు ఒకటికి రెండుసార్లు పాఠాలు చెప్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతిరోజు సకాలంలో ఎఫ్‌ఆర్ఎస్ హాజరయ్యాలన్నారు. పాఠశాల ఆవరణలో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేందుకు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా వినాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే ఆసుపత్రుకి తీసుకెళ్లి వైద్యం చేయించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జల తరంగిణి ప్రమాద స్థలం పరిశీలన

మండలంలోని వాలమూరు గ్రామం వద్ద ఉన్న జలతరంగిణి జలపాతం వద్ద ఈ నెల 22న జరిగిన ప్రమాద స్థలాన్ని ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ గురువారం సందర్శించారు. విద్యార్థులు ప్రమాదానికి గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. ఒక విద్యార్థి ఆచూకీ ఇంతవరకు దొరకలేదు. దానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రైతులకు రాయితీపై విత్తనాల పంపిణీ

రేఖపల్లిలో విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పూనం సరోజిని

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలం రేఖపల్లి పంచాయతీలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు 90 శాతం రాయితీపై ప్రభుత్వం సరఫరా చేసిన మినుము విత్తనాలను గురువారం స్థానిక సర్పంచ్ పూనం సరోజిని చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కో రైతుకు నాలుగు కేజీల విత్తనాలను రూ.85కు ఇవ్వటం జరుగుతుందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వరదల వల్ల రూ.50వేలు నుండి లక్ష రూపాయల వరకు నష్టపోయిన ప్రతి రైతుకి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే రూ.3 వేలు ఇచ్చిన వరద బాధితులకు విజయవాడ తరహాలో పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మణ్, టిడిపి మండల నాయకులు, అగ్రికల్చర్ సిబ్బంది, కిరణ్, రైతులు, పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని పెద్దార్కూర్ పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ నాగమణి, ఎంపీటీసీ అమ్మాజీ చేతుల మీదుగా రైతులకు గురువారం మినుములు, పెసర విత్తనాలు పంపిణీ చేశారు. సబ్సిడీ ద్వారా ప్రభుత్వం ఇచ్చే విత్తనాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, విఆర్వో రాజారావు, అగ్రికల్చర్ సిబ్బంది వంశీ, రైతులు పాల్గొన్నారు.

పెద్ద ఆర్కూరులో విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంపిటిసి నాగమణి, అమ్మాజీ

సిపిఎం పోరాటంతో విద్యుత్ సౌకర్యం

ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి -అనంతగిరి:సిపిఎం పోరాట ఫలితంగా నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ భూరిగ, చిన్నకోనెల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కలిగింది. విద్యుత్ సౌకర్యం లేక ఆయా గ్రామాల ప్రజలు రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సిపిఎం పోరాట ఫలితంగా గురువారం స్థానిక విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు.జెడ్పీటీసీ గంగరాజు, సీపీఎం ఉమ్మడి కార్యదర్శి వర్గ సభ్యుడు కె.గోవిందరావు విద్యుత్ సదుపాయం కల్పించేందుకు కృషి చేశారు.

గంజాయి నిర్మూలనపై అవగాహన

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సిఐ హిమగిరి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ : అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు గురువారం అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గంజాయి నిర్మూలనపై అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్ హిమగిరి, ట్రైనీ డిఎస్పి ఉషశ్రీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులకు గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఏజెన్సీ ప్రాంతం నుండి ఎక్కువగా అమాయక గిరిజనులు గంజాయి కేసుల్లో ఉన్నారని చెప్పారు. మైదాన ప్రాంతం నుండి కొంతమంది గంజాయి స్మగ్లర్ వచ్చి ఇక్కడ ఉన్న గిరిజన యువకులను అధిక డబ్బులు ఇస్తామని ఆశ చూపి గంజాయి రవాణాకు ఉపయోగించు కుంటున్నారన్నారు. దీంతో, గిరిజనులు గంజాయి కేసులకు బలవుతున్నారని తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

సామూహిక సీమంతాలలో పాల్గొన్న నాయకులు, అంగన్వాడీ సిబ్బంది

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:గుంటసీమలో గురువారం అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతాలను నిర్వహించారు. అంగన్వాడీల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారం ద్వారా కలిగే ప్రయోజనాలపై గర్భిణీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది, టిడిపి మండల నాయకులు త్రినాధరావు, జక్కయ్య పాల్గొన్నారు.

పెసా చట్టంపై నేషనల్ కాన్ఫరెన్స్ సంతృప్తికరం

పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు

నేషనల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పెదలబుడు సర్పంచ్ దాస్ బాబు

ప్రజాశక్తి-అరకు లోయ :కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఢిల్లీలో నిర్వహించిన పెసా చట్టంపై నేషనల్ కాన్ఫరెన్స్ (జాతీయ సమావేశం) తనకు సంతృప్తినిచ్చిందని పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలో 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న సర్పంచులు, ఎంపిటిసిలకు కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించారన్నారు. ఈ సమావేశానికి పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు అరకులోయ మండలం నుండి హాజరయ్యారు. 1996లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా తీసుకొచ్చిన పెసా చట్టం నిబంధనలు 5వ షెడ్యూల్ ప్రాంతంలో అమలు తీరుపై పూర్తిస్థాయిలో అవగాహన కోసం ఏర్పాటు చేసిన ఈ సమావేశం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. గిరిజన సాంప్రదాయాలు - కట్టుబాట్లు ఏ మాదిరిగా కాపాడాలన్న విషయంపై మరింత లోతైన పరిశీలన చేసే ఈ కాన్ఫరెన్స్ ఒక వేదిక అయిందన్నారు. పాలకులు ఏ మాదిరిగా గిరిజన ప్రాంత ఆచార సాంప్రదాయాలను కొన్ని కార్పొరేట్ శక్తుల కోసం నిబంధనలు ఉల్లంఘిస్తారన్న విషయాన్ని ఈ సమావేశం స్పష్టం చేసిందని దాసు బాబు అన్నారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఒక పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన తదితర అంశాలకు సంబంధించిన నిబంధనలపై అవగాహన కల్పించారన్నారు. దేశంలో 5వ షెడ్యూల్ పరిధిలో ఉన్న పది రాష్ట్రాలకు జరిగిన ఇటువంటి సదస్సులు భవిష్యత్తులో మరిన్ని జరగాలని ఆయన ఆకాంక్షించారు.

30న మహాధర్నాను జయప్రదం చేయండి

సిఐటియు ఆధ్వర్యాన ఆందోళనలో మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - ఆరిలోవ : సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం చెల్లింపు, రెగ్యులర్ చేసి ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శానిటరీ కార్మికులు గురువారం విమ్స్ ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ నెల 30న జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ కార్మికులంతా ఐక్యంగా పోరాడి, హక్కులను సాధించుకుందామని పిలుపునిచ్చారు. మహాధర్నాలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విమ్స్ ఆసుపత్రి శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు డి.రాజేశ్వరి, వై.కనకరాజు, అన్నపూర్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ములగాడ : కాంట్రాక్టు మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్ లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం యూనియన్ మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో 58,59, 60 వార్డుల్లో ఈనెల 30 జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టే మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ఆప్కాస్ రద్దుచేసి పర్మినెంట్ అనే పదం తొలగించి, మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ, ఇతర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జోన్ అధ్యక్షులు కె.రమణ జోన్ నాయకులు బి రాంబాబు, డి.రాము, బి.సూరిబాబు తిరుపతిరావు, ఆదినారాయణ, డి.రాజు రైలుబాబు, ఎస్ లక్ష్మి రమణమ్మ, సిహెచ్.లక్ష్మి, సీత, దుర్గ, శ్యామల సింహాచలం, శ్రీను పాల్గొన్నారు.

'న్యూ లైఫ్' విద్యార్థుల ఔదార్యం

వరద బాధితులకు ఆర్థిక సాయం

ఆర్థిక సాయం చేస్తున్న న్యూలైఫ్ విద్యార్థులు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని గొట్టిపల్లి గ్రామంలోని న్యూలైఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు, న్యూలైఫ్ విద్యాసంస్థల వెల్ఫేర్ అసోసియేషన్ తరపున విజయవాడ, వయనాడ్ (కేరళ) వరద బాధితుల సహాయార్థం రూ.1.12లక్షల విరాళాలను అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కె.శ్యామ్ మాథ్యూస్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు వరద బాధితుల కోసం నిధులు సేకరించడం అభినందించారు. సేకరించిన మొత్తాన్ని బాధితులకు పంపనున్నట్లు తెలిపారు. అందరికీ అందుబాటులో, అతి తక్కువ ఫీజులతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంతోపాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జయ శ్యామ్, ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్ సిగ్నల్ అందక అవస్థలు

జియో సెల్ టవర్

ప్రజాశక్తి-అనంతగిరి : మండలంలోని వెంగడ పంచాయతీ కేంద్రంలో సెల్ సిగ్నల్స్ అందక వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. జియో టవర్ ఏర్పాటు చేసి ఏడాది గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో, సెల్ వినియోగదారులు సిగ్నల్ అందక ఇబ్బందులకు గురవుతున్నారు.వేంగడలో సిగ్నల్ సౌకర్యం అందక పోవడంతో నిరుద్యోగ యువతీ యువకులు ఆన్‌లైన్ శిక్షణకు ఇబ్బంది పడుతున్నారు. సిగ్నల్ సౌకర్యం పునరుద్ధరణ చేస్తే గ్రామంలోనే శిక్షణ పొందడానికి వీలు ఉంటుందన్నారు. జియో యాజమాన్యం సిగ్నల్స్ పునరుద్ధించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

టోకూరులో 'ఇది మంచి ప్రభుత్వం'

పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్న నేతలు, అధికారులు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని టోకురు పంచాయతీ సర్పంచ్ కిల్లో మొస్య, కొత్తురు పంచాయతీ సర్పంచ్ సార సీతయ్య, ఎన్ ఆర్ పురం పంచాయతీ బడ్నాయిని సన్నమ్మ అధ్యక్షతన ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు.ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై వివరించారు.ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ఆ దిశగా అడుగులు వేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల మండల నాయకులు బుజ్జిబాబు, దొన్ను, ఉప సర్పంచ్ నరేంద్ర, స్పెషల్ ఆఫీసర్లు ఆర్ఐ శంకరరావు, జెఈ గౌతమ్, సీడిపిఓ సూర్య కుమారి, అరకు నియోజకవర్గ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు రత్నం రాజు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

65 మందికి ఉచిత కంటి పరీక్షలు

కంటి పరీక్షలు చేస్తున్న అప్తాల్మిక్ వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని గుంటగన్నెల పంచాయతీ లక్కా గ్రామంలో విశాఖపట్నం ఎల్‌వి ప్రసాద్, హెచ్‌ఆర్ ఏసిఏ రాష్ట్ర ఏజెన్సీ మహిళ విభాగ అధ్యక్షురాలు కే కృష్ణకుమారి ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వివిధ కంటి వ్యాధులతో బాధపడుతున్న 65 మంది వ్యాధిగ్రస్తులు పాల్గొనగా అందులో 16 మందికి కంటి ఆపరేషన్ నిర్వహించాలని రిఫర్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్‌ఏసి ఏజెన్సీ కోఆర్డినేటర్ కె రవీంద్ర, పిహెచ్‌ఎన్ రత్నం, వైద్య సిబ్బంది జగదీష్, డి రాకేష్, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులో పాల్గొన్న విద్యార్థులు

పాఠశాలల్లో చెకుముకి టాలెంట్ టెస్టు

ప్రజాశక్తి - ఎటపాక : ఆంధ్రప్రదేశ్ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన పాఠశాల స్థాయిలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు యటపాక మండలంలోని మూడు పాఠశాలల్లో గురువారం నిర్వహించారు. నెల్లిపాక జెడ్‌పి ఉన్నత పాఠశాల నుండి 40 మంది, నల్లకుంట ఆశ్రమ హైస్కూల్ నుంచి 100 మంది, గొల్లగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 25 మంది విద్యార్థులు చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలు రాశారు. చెకుముకి సైన్స్ సంబరాలు జరగడానికి సహాయ సహకారాలు అందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, పాఠశాల సిబ్బందికి, ఇన్విజిలేటర్లుగా వ్యవహరించిన దర్మల మహేష్, తాటి రవి, ఎస్.రవితేజ, యం.భద్రయ్య, కారం మోహన్ రావు, చిచ్చుడిరామారావు తదితరులకు యుటిఎఫ్ యటపాక మండల కమిటీ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ తరపున యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాగర్, కె.శ్రీనివాసరావు ప్రత్యేక ధన్యావాదాలు తెలియజేశారు.

పివిటిజిల అభివృద్ధికి సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని ఆదిమ బలహీన గిరిజన సమూహాలు (పివిటిజి) అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రాకలైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ఏపీవో జనరల్ డిఎన్‌వి.రమణ పేర్కొన్నారు. పిఎం జన్‌మన్ పథకం అమలుపై గురువారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఐటిడిఎ ఎపిఓ రమణ మాట్లాడారు. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని ఏజెన్సీలోని పివిటిజిల గ్రామాల్లో పీఎం జన్‌మన్ పథకం ద్వారా 11 రకాలైన అంశాల్లో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు.

ఇందులో ప్రధానంగా గృహాలు, తాగునీరు, రహదారులు, కరెంటు, విద్య, వైద్య సేవలు, నెట్‌వర్క్ సౌకర్యం, విడివికె అభివృద్ధి, అంగన్వాడి కేంద్రాలు తదితర కార్యక్రమాలు పిఎం జన్‌మన్ ద్వారా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 2న ఢిల్లీ నుండి ప్రధానమంత్రి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయానికి మండలానికి పదిమంది చొప్పున పివిటిజిలను తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఆ రోజు ప్రత్యేక మెడికల్ క్యాంప్, పివిటిజిలకు హెల్త్ కార్డులు ఏర్పాటు చేయాలని, గిరిజన కొమ్ము డ్యాన్స్ నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, డిఎల్‌డిఓ కే.కోటేశ్వరరావు, ఉపాధి హామీ పథకం ఏపీడి జి.శ్రీనివాసరావు, పిహెచ్‌ఓ చిట్టిబాబు, పిఏఓ యల్.రాంబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, ఎంపీడీవో హరికృష్ణ, సిడిపిఓ సంధ్యారాణి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చైతన్య, మల్లికార్జున్‌రావు, రాజేంద్ర బాబు, ఎస్‌ఓ మార్తమ్మ, ఎస్‌ఐ మోహన్‌రావు, ఏఈలు, జెఇలు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని మండల విద్యాధికారి ఎల్.రాంబాబు ఉపాధ్యాయులకు సూచించారు. కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీ ముళ్ళుమెట్ట గ్రామంలోని జీపీఎస్ టీడబ్ల్యూ పాఠశాలను గురువారం సందర్శించారు. ముందుగా పాఠశాలలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల ఆవరణలో గార్డెన్‌ను పరిశీలించారు. కూరగాయలు పండిస్తున్న తీరును పరిశీలించి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింహాచలంను అభినందించారు.

విశాఖలో నారా లోకేష్ ప్రజాదర్బార్

ప్రజల నుంచి వినతుల స్వీకరణ

వినతిపత్రం స్వీకరిస్తున్న మంత్రి లోకేష్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖలో పర్యటిస్తున్న రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ గురువారం జిల్లా తెలుగుదేశం కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆయన్ని స్వయంగా కలిసి ప్రజలు తమ సమస్యలు విన్నవించారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. వైసిపి ప్రభుత్వంలో దళితుల హత్యలు, దాడులపై సమగ్ర విచారణ జరపాలని ఒక దళిత సంఘం నాయకుడు లోకేష్‌కు సమర్పించిన వినతి పత్రంలో కోరారు. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సమస్యలు పరిష్కరించాలని ఎపి నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ప్రతినిధులు లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు విధానంలో డిఎంఇ, ఎపివివిపి, డిపిహెచ్, ఎన్‌హెచ్‌ఎం విభాగాలలో పనిచేస్తున్న నర్సులను రెగ్యులర్ చేయాలని, వంద శాతం గ్రాస్ జీతం అమలు చేయాలని, పరస్పర అంగీకార బదిలీలు అమలు చేయాలని, బీమా అందించాలని కోరారు. అనకాపల్లి మండలం కోడూరులో ఎక్స్ సర్వీస్ మెన్ కోటాలో తమ తండ్రికి కేటాయించిన 5.22 ఎకరాల భూమిని వైసిపి నాయకుల అండతో ఆక్రమించారని, విచారించి తగిన న్యాయం చేయాలని ఎస్.నాగమణి, జి.జయలక్ష్మి కోరారు. డిఎస్సీ 2008 నోటిఫికేషన్‌లో ఎంపికై నష్టపోయిన అభ్యర్థులకు తగిన న్యాయం చేయాలని ఎపి తెలుగు టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. రష్యాలో వైద్య విద్య అభ్యసిస్తున్న తమ పిల్లలకు ఎన్టీఆర్ విదేశీ విద్యాదీవెన, బిసి ఓవర్ సీస్ స్కాలర్ షిప్ మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటిందనే నెపంతో గత వైసిపి ప్రభుత్వం నిలిపివేసిన ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని దళిత సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు. ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని, గత వైసిపి ప్రభుత్వంలో దళితుల హత్యలు, దాడులపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ సుధాకర్ అంశం, వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన డ్రైవర్ సుబ్రహ్మణ్యం, కోడికత్తి శ్రీను, కిరణ్ కుమార్ హత్య వంటి కేసులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు కోరారు. భర్త చనిపోయిన తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయడంతో పాటు జీవనోపాధి కల్పించాలని విశాఖకు చెందిన గంటిపిల్లి నూకరత్నం విజ్ఞప్తి చేశారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం పార్టీ కార్యాలయానికి పెద్దఎత్తున చేరుకున్న నేతలు, కార్యకర్తలను కలిశారు. వారితో కలిసి ఫొటోలు దిగారు.

జర్నలిస్టులకు ఉచితంగా ఇళ్ల స్థలాలు కేటాయించాలి

కూటమి ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకారం జర్నలిస్టులకు ఉచితంగా 4 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని లోకేష్‌ను పలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఇతర రాష్ట్రాల్లో రిటైర్డ్ జర్నలిస్టులకు రూ.10 వేలు నుంచి రూ.15 వేల వరకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ సదుపాయం కల్పిస్తున్నాయని, అదే మాదిరిగా మన రాష్ట్రంలోనూ కల్పించాలని కోరారు. లోకేష్‌ను కలిసిన వారిలో లోకల్ న్యూస్ పేపర్ అసోసియేషన్ అధ్యక్షులు పి.సత్యనారాయణ, ఐజెయు సభ్యులు ఆర్.రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

బిల్డర్లపై భారం మోపొద్దు!

రాష్ట్ర వ్యాప్తంగా బిల్డర్లకు భారం పడేలా ఆగస్టు 20న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో నంబర్ 1768902/హెచ్1/2024 ఉందని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని పలువురు బిల్డర్లు లోకేష్‌ను కోరారు. తణుకులో ఇటీవల వెలుగు చూసిన టిడిఆర్ కుంభకోణాన్ని వారంతా గుర్తు చేశారు. అక్కడి మున్సిపాలిటీ అధికారులు కూడా బిల్డర్లకు ఇబ్బంది పెట్టేలా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. లోకేష్‌ను కలిసిన వారిలో బిల్డర్లు పివి.ఆదినారాయణ, పి.వెంకటమణి, పృథ్వీ, చాందీ, దిలీప్ కుమార్ ఉన్నారు.

హోటళ్లు, షాపులు పనివేళల జిఒ అమలు చేయాలి

విశాఖ నగరంలో రాత్రిపూట 12 గంటల వరకు హోటల్స్, రెస్టారెంట్లు, షాపులు తెరుచుకునేందుకు వీలుగా జిఒ వున్నా, అమలు కావడం లేదని లోకేష్‌కు విశాఖపట్నం హోటల్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఆ జిఒను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వసంత కృష్ణ, శివారెడ్డి, తాళ్లూరి బాలచంద్ర, దుక్క కిషోర్ యాదవ్ పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన ట్రైబల్ వెల్ఫేర్ డీడీ

పాఠశాలలో పర్యటించిన డీడీ కొండలరావు

ప్రజాశక్తి-దేవీపట్నం

దేవీపట్నం కొత్తవీధి, పోతవరం, ముసినిగుంట, శరభవరం ఆశ్రమ ఉన్నత పాఠశాలలను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు గురువారం సందర్శించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని సూచించారు. విద్యార్థులతో ముచ్చటించి వారితో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ఎటిడబ్ల్యుయు రామతులసి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి చంద్రకళ, సిహెచ్ నూకాలమ్మ తదితరులున్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్, వార్డు మెంబర్, గిరిజనులు

రహదారి నిర్మాణంపై హర్షం

ప్రజాశక్తి- కొయ్యూరు : సమస్య చెప్పిన వెంటనే పాడేరు ఐటిడిఎ పివో తగు రీతిలో స్పందించి రహదారి నిర్మాణం పూర్తి చేయడం పట్ల మండలంలోని బూదరాళ్ల పంచాయతీ సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డ్ మెంబర్ సాగిన సంజీవ్‌తో పాటు పలువురు గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం చేసిన రోడ్డును పరిశీలించిన ఆయన వారు మాట్లాడుతూ బూదరాళ్ల పంచాయితీ గరికిబంద జంక్షన్ నుండి గరిమండ వరకు రెండున్నర కిలోమీటర్లు రహదారి ఇటీవల కాలం వరకు కాలు వేసి తీసే పరిస్థితి లేదని, భారీవర్షాలకు చిత్తడి చిత్తడిగా మారిందని తెలిపారు. ఈ సమస్యలపై రెండు వారాల క్రితం పాడేరులో పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఐటిడిఎ పిఓకు విన్నవించినట్లు చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే రహదారి పనులు ప్రారంభించి, పూర్తి చేయిస్తామని పిఓ హామీ ఇచ్చారని, ఈ మేరకు పూర్తి చేశారని తెలిపారు. హామీని నెరవేర్చిన పాడేరు పివోకు, సంబంధిత శాఖ అధికారులకు సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డ్ సభ్యుడు సంజీవ్, గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎడతెరిపి లేకుండా వర్షం

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గురువారం తెల్లవారుజాము నుంచి ఏకదాటిగా వర్షం కురిసింది. కొన్ని చోట్ల భారీ వర్షం పడగా, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసింది. రోజంతా ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. మండల కేంద్రానికి వచ్చేందుకు పలువురు ఇబ్బందులు పడ్డారు.

హాస్టల్‌లో తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-చింతూరు : స్థానిక సాంఘిక సంక్షేమ వసతి గృహంలో జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన తాగునీటి బోరు ఏర్పాటు కార్యక్రమం గురువారం ట్రస్టు చైర్మన్, ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్ ప్రారంభించారు. 200 మంది విద్యార్థులు ఉంటున్న ఈ వసతి గృహంలో ఉన్న బోరు పూడిపోయి నీరు సక్రమంగా రాక విద్యార్థులు కాలకృత్యాలు చేర్చుకునేందుకు కూడా వీరు లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని హాస్టల్ వార్డెన్ తాతాజీ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్‌కు తెలియజేయగా ఆయన ట్రస్టు తరుపున రూ.60వేలుతో తాగునీటి బోరును ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ట్రస్ట్ కార్యదర్శి మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్, సభ్యులు ఎస్‌కే రియాజ్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రమాదంలో గాయపడ్డ సీనియర్ మేనేజర్ మల్లేశ్వరరావు మృతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో ఈ నెల 24వ తేదీన జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సీనియర్ మేనేజర్ ఎస్.మల్లేశ్వరరావు బుధవారం అర్ధరాత్రి పరిస్థితి విషమించి మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఎస్ఎంఎస్ - 1 విభాగంలో సీనియర్ మేనేజర్‌గా పని చేస్తున్న మల్లేశ్వరరావుపై ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం స్టీల్ మెటల్ లిక్విడ్ పడటంతో తీవ్రంగా గాయాలయ్యాయి. 90 శాతం శరీరం కాలిపోవడంతో హుటాహుటిన నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స అందించడం కోసం ముంబయి తరలించాలని, దీనికి ఎయిర్ అంబులెన్స్ వినియోగించాలని చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఆయన మృతి చెందారు.

మారేడుమిల్లిలోని అందాల జలతరంగిణి వాటర్‌ఫాల్స్

ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
44వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం
Advt. Feature
రంపచోడవరం డివిజన్ అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం 26-09-2024
8 పేజీలు

అందాల రంపచోడవరం

- ఆదివాసీల బతుకులకు నిలువెత్తు నిదర్శనం
- నియోజకవర్గంపై పాలకులు దృష్టిసారిస్తే అభివృద్ధికి విస్తృత అవకాశాలు

ప్రజాశక్తి - రంపచోడవరం

పర్యాటకం అంటేనే ఠక్కున గుర్తుకొచ్చే జిల్లా.. అల్లూరి. ప్రకృతి అందాలకు, సహజ సోయగాలకు ఈ ప్రాంతం ఎంతో ప్రసిద్ధి. పూర్తి ఆదివాసీ జిల్లా. రాష్ట్రంలోనే విస్తీర్ణంలో అతిపెద్ద జిల్లా. ఇక్కడి రంపచోడవరం, పాడేరు డివిజన్లు ప్రకృతి అందాల్లో ఒకదానికొకటి పోటీ అన్నట్టు ఉంటాయి. ఆదివాసీల బతుకులకు నిలువెత్తు నిదర్శనమైన ఈ ప్రాంతాలు నేటికీ పాలకుల నిర్లక్ష్యానికి గురవడం శోచనీయం. ముఖ్యంగా రంపచోడవరం నియోజకవర్గాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విమర్శలు అన్నివైపుల నుంచీ వినిపిస్తున్నాయి. పోలవరం నిర్వాసితుల గోడు పాలకులకు పట్టడం లేదని బాధితులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా అభివృద్ధి ప్రణాళికలు తయారుచేసి ప్రజల సహకారంతో ముందుకెళ్తే రంపచోడవరం నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

రంపచోడవరం నియోజకవర్గంలో 11 మండలాలు ఉన్నాయి. విస్తీర్ణంరీత్యా రాష్ట్రంలో అతిపెద్ద నియోజకవర్గమని చెప్పొచ్చు. సుమారు రెండు లక్షలా 73 వేల మంది ఇక్కడ జీవిస్తున్నారు. 2022లో జిల్లాల పునర్విభజన సమయంలో తూర్పుగోదావరి జిల్లా నుంచి ఈ నియోజకవర్గం విడివడింది. ఆ ప్రక్రియలోనే విశాఖ జిల్లా నుంచి పాడేరు డివిజన్ విడిపోయింది. ఇలా విడగొట్టిన పాడేరు, రంపచోడవరం డివిజన్లను కలిపి అల్లూరి సీతారామరాజు జిల్లాను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రంపచోడవరం నియోజకవర్గంలో చింతూరు, రంపచోడవరం ఐటిడిఎలు ఉన్నాయి. వీటిద్వారా ఆదివాసీల అభివృద్ధికి కృషి జరుగుతోంది.

ప్రకృతి అందాలకు నెలవు

సహజ సిద్ధమైన అటవీ అందాలకు, జలజల పారే సెలయేళ్లకు రంపచోడవరం నియోజకవర్గం (మిగతా 2లో)

రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయం

ప్రజాశక్తి
44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో
44వ వసంతంలోకి అడుగిడిన ప్రజాశక్తి దినపత్రికకు
హృదయపూర్వక శుభాకాంక్షలు

శ్రీ కట్టా సింహాచలం ఐ.ఏ.ఎస్.,
ప్రాజెక్ట్ అధికారి, రంపచోడవరం

మరియు
వెలుగు కార్యాలయ సిబ్బంది

శ్రీ అల్లాడి శ్రీనివాసరావు ఏపిడి,
వెలుగు కార్యాలయం రంపచోడవరం మండలం,

అభివృద్ధి పథంలో
సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ
వెలుగు కార్యాలయం (TPMU)
రంపచోడవరం మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా.

ప్రజాశక్తి
44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో
44వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు శుభాకాంక్షలు
డి.శ్రీనివాసరావు ఎ.ఒ.
వ్యవసాయశాఖ కార్యాలయం
మరియు సిబ్బంది
చింతూరు మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా.

అందాల రంపచోడవరం

(మొదటి పేజీ తరువాయి..) ప్రసిద్ధి. మారేడుమిల్లి, రంపచోడవరం, చింతూరు, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాలు ప్రకృతి అందాలకు నెలవు. మారేడుమిల్లిలో వ్యూపాయింట్‌లు అద్భుతంగా ఉంటాయి. తొలుత నియోజకవర్గ కేంద్రానికి సమీపంలోని రంపలో ఉన్న జలపాతం ఆకట్టుకుంటుంది. సమీపంలోనే ఉన్న భూపతిపాలెం రిజర్వాయర్ కూడా ప్రసిద్ధిచెందినదే. అలా రంపచోడవరం నుంచి పయనమై ఘాట్ రోడ్డు దాట్టుకొని మారేడుమిల్లి చేరుకోగానే అందాల దొంతరే కానవస్తుంది. కార్తీకవనం, పాములేరు వాగు, వనవిహారి రిసార్ట్, స్వర్ణధార, అమృతధార, జలతరంగణి జలపాతాలు వీక్షకులను కట్టిపడేస్తాయి. ఈ ప్రకృతి అందాల చుట్టూ పర్యాటక రంగం విస్తరించింది. హోటళ్లు, రిసార్టుల ఏర్పాటు, స్థానిక ఉత్పత్తుల అమ్మకాలతో వందల మందికి ఉపాధి లభించింది.

వెంటాడుతున్న రవాణా కష్టాలు

రంపచోడవరం నియోజకవర్గ వాసులు పాడేరు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే వ్యయప్రయాసలు పడాల్సి వస్తోంది. ఎటపాక, కూనవరం వాసులైతే ఏకంగా 400 పైచిలుకు కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. రంపచోడవరం నియోజకవర్గ కేంద్రం నుంచి కూడా సరైన రవాణా సదుపాయాలు లేవంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవొచ్చు. ప్రభుత్వ రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఎక్కువమంది ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. రంపచోడవరం నియోజకవర్గ కేంద్రం నుంచి పాడేరుకు ఒక్క బస్సు సర్వీసు మాత్రమే మాత్రమే నడుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లా అధికార యంత్రాంగాన్ని కలిసి సమస్య చెప్పుకుందామన్నా, వినతిపత్రం ఇద్దామన్నా రెండు రోజులు పడుతోందని పలువురు చెబుతున్నారు. రంపచోడవరానికి ఆర్‌టిసి డిపో లేకపోవడంతో రాజమండ్రి, గోకవరం, కాకినాడ ప్రాంతాల నుంచి సర్వీసులు నడుస్తున్నాయి. రంపచోడవరం నియోజకవర్గ కేంద్రం నుంచి చింతూరు, ఎటపాక, విఆర్.పురం, కూనవరం, మారేడుమిల్లి మండలాలకు లోకల్ సర్వీసులు కూడా లేకపోవడంతో జనం అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ కేంద్రంగా ఆర్‌టిసి డిపో ఏర్పాటు చేసి అన్ని మండలాలకు బస్సు సర్వీసులు నడపాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఆహ్లాదకరం.. చీకుధార జలపాతం



పెరుగుతున్న పర్యాటకుల తాకిడి

ప్రజాశక్తి - రాజవొమ్మంగి

అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలోని లోతట్టు గ్రామమైన అమ్మిరేకుల శివారులో ఉన్న చీకుధార జలపాతం పర్యాటకులను అబ్బుర పరుస్తోంది. ఈ జలపాత ప్రాంతం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. పర్యాటకులు అక్కడకు నిశ్చితంగా వెళ్లి రావొచ్చు. వర్షాలు కురిసే రోజుల్లో ఈ వాటర్ ఫాల్ మరింత అందంగా కనిపిస్తుంది. వీటిని తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. రహదారి మార్గం సక్రమంగా లేకపోయినా రాజవొమ్మంగి గ్రామం నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ వాటర్ ఫాల్‌ను తిలకించడానికి పర్యాటకులు మక్కువ చూపుతున్నారంటే వీటి అందం ఏపాటిదో ఇట్టే అర్థం చేసుకోవొచ్చు. ఎత్తైన చెట్లు, ఔషధ గుణాలు కలిగిన మొక్కల నడుమ పర్వత శిఖరం నుంచి దుమికే ఈ జలపాతాన్ని చూసి వారంతా మురిసి పోతారంటే అతిశయోక్తి కాదు. చిన్నా పెద్దా అన్న తారతమ్యం లేకుండా ఈ జలాపాతం వద్ద జలకాలాడటం పరిపాటి.

ఇక్కడ మరిన్ని వసతులను ప్రభుత్వం సమకూర్చి, రహదారిని బాగుచేసి రవాణా సదుపాయాలను మెరుగుపరిస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ఈ జలపాతం వద్ద ఉన్న శివలింగాన్ని పర్యాటకులు చూసి తరిస్తారు. కార్తీకమాసంలో ఇక్కడ పండగ వాతావరణం నెలకొంటుంది.

పాపికొండల నడుమ గోదావరి

బహు సుందరం.. పాపికొండలు

ప్రజాశక్తి - విఆర్.పురం : పాపికొండలు.. బహు సుందరం. పాపికొండల యాత్ర ప్రతి ఒక్కరి జీవితంలో మధుర స్మృతులను మిగులుస్తుందనడంలో అతిశయోక్తి లేదు. శక్తివంతమైన గోదావరి నది ఇరుకైనది. పాపి కొండల వెంట మలుపులు, మలుపులతో ఇది ప్రవహిస్తుంది. పాపికొండలు అసలు రూపాన్ని చూడాలంటే రాజమండ్రి లేదా భద్రాచలం నుంచి పడవ ప్రయాణం చేయాల్సి ఉంటుంది. రైడర్ లేదా రివర్ స్టీమర్‌లు, మోటారు పడవలపై వెళ్లి ఈ కొండల అందాలను తిలకించవచ్చు. రాజమండ్రి నుంచి 60 కిలోమీటర్లు, పోలవరం నుంచి 20 కిలోమీటర్లు దూరంలో ఈ పాపికొండలు ఉన్నాయి. పాపికొండలు మూడు కొండల సముదాయం. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో విస్తరించి ఉన్న గోదావరి నదికి ఇవి ప్రత్యేక శోభను తెచ్చిపెట్టాయి. పాపి కొండలను రక్షిత జాతీయ ఉద్యానవనంగా పేర్కొంటారు. ఈ ప్రదేశాన్ని శ్రీరాముడు, సీతాదేవి వనవాస సమయంలో సందర్శించినట్టు భక్తులు చెప్పుకుంటుంటారు. విలీన మండలాల్లోని కూనవరం, శ్రీరామగిరి నుంచి కూడా పడవల్లో వెళ్లి పాపికొండలను పెద్ద సంఖ్యలో పర్యాటకులు తిలకిస్తారు.

రా.. రమ్మంటున్న మన్యం అందాలు

ప్రకృతి రమణీయ దృశ్యాలకు పుట్టినిల్లు



అమృతధార జలపాతం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

సహజ సిద్ధమైన అటవీ అందాలకు, జలజల పారే సెలఖ్కు, రా రమ్మని పిలిచే ప్రకృతి రమణీయ దృశ్యాలకు పుట్టినిల్లు అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం, మారేడుమిల్లి ప్రాంతాలు. ఇక్కడి ప్రకృతి అందాలు పర్యాటకులను కట్టి పడేస్తాయి అనడంలో అతిశయోక్తి లేదు. తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రికి 59 కిలోమీటర్ల దూరంలో భద్రాచలం వెళ్లే మార్గంలో రంపచోడవరం, మరో 25 కిలోమీటర్లు దూరంలో మారేడుమిల్లి ప్రాంతాల్లో తూర్పు కనుమల అటవీ అందాలను తనివితీరా ఆస్వాదించవచ్చు. మారేడుమిల్లిలో వ్యూపాంట్లు అద్భుతంగా ఉంటాయి. డీప్ ఫారెస్ట్‌లోనికి వెళ్లే కొలది దారిపొడవునా అడవి జంతువులు, అరుదుగా పులులు, పక్షులు కనిపిస్తాయి. మారేడుమిల్లి అడవులను ఒకప్పుడు అల్లూరి సీతారామరాజు తన స్థావరంగా ఉపయోగించారు. ఈ ప్రాంతంలో జలపాతాలు, ప్రకృతి అందాలను ఒకసారి తెలుసుకుందాం పదండి..!

రంపచోడవరం మన్యం ప్రాంతంలోనికి అడుగుపెట్టగానే పర్యాటకులు తొలిత సీతపల్లి గడి బాపనమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శిస్తారు. ఐ.పోలవరం గ్రామ సమీపంలో ఉన్న పార్క్ పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఇక్కడ చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు మరోపక్క రాళ్లపై నుండి ఉరకలు వేస్తూ పరిగెడుతున్న వాగుతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇక్కడికి దగ్గరిలో తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే ఎత్తైన కొండపై నిర్మించిన శ్రీవెంకటేశ్వర స్వామి ఉంది.

రంప జలపాతం

రాజమండ్రి నుండి వచ్చే పర్యాటకులకు ముందుగా రంపచోడవరం మండలంలోని రంప గ్రామంలో కొండపై నుండి జాలువారే రంప జలపాతం దర్శనమిస్తుంది. ఈ జలపాతంలో స్నానం చేసి అక్కడే గుహలో శివుని విగ్రహాన్ని దర్శించుకుంటూ ఉంటారు. అక్కడ నుండి కిందకి వస్తే రాతితో నిర్మించిన 14వ శతాబ్దం నాటి ప్రసిద్ధి చెందిన భ్రమరాంబికా మల్లిఖార్జున స్వామివారి ఆలయం ఉంది. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఈ శివాలయంలో పూజలు చేసేవారని స్థానికులు చెబుతూ ఉంటారు.

ప్రకృతి రమణీయంగా ఉన్న గుడిస హిల్ స్టేషన్‌కు వెళ్లే మార్గం

భూపతిపాలెం రిజర్వాయర్

రంపచోడవరం మండలం భూపతిపాలెం వద్ద నిండు కుండలా కనిపించే రిజర్వాయర్ అందాలు కోసం ఎంత చెప్పినా తక్కువే. కొండల మధ్యలో నుంచి వెళ్లే రహదారి, రహదారికి ఒకవైపు దత్తమాన అడవి, మరో వైపు నీలి రంగులో కనిపించే నీరు దర్శనమిస్తాయి. అలా వంపులు తిరిగే రోడ్డుపై ప్రయాణం మధురానుభూతిని కలిగిస్తుంది.

నందనవనం

మారేడుమిల్లికి 5 కిలోమీటర్లు దూరం ఉన్న నందవనం బేంబూ చికెన్, ఔషధ మొక్కల తోటలకు ప్రసిద్ధి. ఇదికూడా సహజ అందాల కోవకే చెందినదే. అయితే సరైన నిర్వహణ లేదు. తూర్పు కనుమలు, ఒరిస్సా నుంచి తీసుకొచ్చిన మొక్కలను సందర్శనకు ఇక్కడ ఉంచారు.

వాలీ సుగ్రీవ వాన మూలికల ప్రదేశం

నందనవనానికి దగ్గరిలోనే వాలీ సుగ్రీవ మెడిసినల్ ప్లాంట్ కన్వర్వేషన్ ఏరియా ఉంది. ఇది ఎత్తుపల్లాల భూభాగం. సుమారు 260 హెక్టార్లలో విస్తరించిన ఈ ఏరియాలో 230 రకాల అరుదైన మొక్కలను గుర్తుంచారు. ఇది కూడా సందర్శించదగినదే.

కార్తీకవనం

దీనికి దగ్గరిలో కార్తీకవనం ఉంది. ఇది మొక్కలతో నిండిన ఒక ఆధ్యాత్మిక ప్రదేశం. ముఖ్యంగా కార్తీక మాసంలో ఇక్కడ వనభోజనాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. రావి, వేప, ఉసిరి, మర్రి, బిల్వ మొక్కలు ఎక్కువగా కనిపిస్తాయి.

కాఫీ, మిరియాలు తోటలు

మారేడుమిల్లి చుట్టు పక్కల చూడవలసిన మరో స్పాట్ కాఫీ తోటలు. కాశ్మీరు తరువాత కాఫీ తోటలు చూడాలంటే మారేడుమిల్లి రావాల్సిందే. ఈ కాఫీ తోట మధ్యలో మిరియాల తోటలు దర్శనమిస్తాయి. వీటితో పాటు చెట్లు, పొదలు, వివిధ పండ్ల తోటలు కూడా చూడవచ్చు.

14వ శతాబ్దం నాటి భ్రమరాంబికా మల్లిఖార్జున స్వామి ఆలయం

పాములేరు వాగు

మారేడుమిల్లికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో భద్రాచలం వెళ్లే మార్గంలో ఉన్న మరో పర్యాటక ప్రదేశం పాములేరు వాగు. ఈ వాగు చూడడానికి పాము లాగా మెలికలు తిరుగుతూ చాలా ప్రశాంతంగా కనిపిస్తుంది. ఈ వాగులో మొసళ్లు ఉన్నాయి. ఈ వాగు లోతు తెలియక ఇందులో దిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఇక్కడకి వచ్చే పర్యాటకులు ఈ వాగులోకి దిగడాన్ని నిషేధించారు.

జంగిల్ స్టార్ రిసార్ట్స్

పాములేరు వాగుకు దగ్గరిలో జంగిల్ స్టార్ క్యాంప్ సైట్‌కి రామాయణానికి మధ్య లింక్ ఉంది. ఇక్కడ రామాయణ కాలంలో యుద్ధం జరిగినట్లు భావిస్తుంటారు. క్యాంప్ సైట్ పక్కనే మూడు వైపుల నుంచి ప్రవహించే వాలమూరు నది ఉంది. గడ్డి మైదానాలు, కొండలు, అడవులు... చెప్పాలంటే తూర్పు కనుమల అందాలన్నీ ఇక్కడే ఉన్నాయా? అన్నట్టు అనిపిస్తుంది.

టైగర్ క్యాంపు

మారేడుమిల్లి నుండి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో టైగర్ క్యాంపు అడవిలో ఉంది. అడవి జంతువులు, పక్షులు ఎక్కువగా ఉంటాయి. అక్కడికి వెళితే పులుల గాండ్రింపులు వినవచ్చు.

జలపాతాలు

స్వర్ణధార, అమృతధార అనేవి మారేడుమిల్లిలో (మిగతా 4లో..)

రా.. రమ్మంటున్న మన్యం అందాలు

(3వ పేజీ తరువాయి..) చూడవలసిన మరికొన్ని జలపాతాలు. ఇలా ఎన్నో మారేడుమిల్లిలో చూడవలసిన ఆకర్షనీయ ప్రదేశాలు ఉన్నాయి.

జలతరంగిణి

మారేడుమిల్లికి 7 కిలోమీటర్ల దూరంలో జలతరంగిణి జలపాతం ఉంది. పెద్ద రాయి మీద నుండి నిత్యం ఊరకలేస్తూ నీరు ప్రవహిస్తుంది. ఈ జలపాతం లోతు ఉండదు. దీంతో ఇక్కడకి వచ్చిన పర్యాటకులు స్నానం చేసి సేదతీరుతారు.

అమృతధార

మారేడుమిల్లికి సుమారు 18 కిలోమీటర్ల ఘాట్ రోడ్డులో కొద్ది దూరం వెళితే కనిపించే మరో అద్భుతం అమృతధార జలపాతం. ఈ జలపాతం వద్దకు వెళ్లాలంటే కొద్దిగా సాహసమనే చెప్పాలి. కొండపై నుండి కొంత లోయలోకి దిగాల్సి ఉంటుంది. అయితే అక్కడకు వెళ్ళడానికి పడిన శ్రమ ఆకాశం నుండి జాలువారుతున్నట్టు కనిపించే జలపాతం అందాలు చూడగానే మాయమైపోతుంది.

వ్యూ పాయింట్స్

మారేడుమిల్లికి సమారు 15 కిలోమీటర్ల దూరంలో మన్యం వ్యూ పాయింట్, చింతూరు మండలం తులసిపాక గ్రామ సమీపంలో సోకేలేరు వ్యూ పాయింట్ ఉన్నాయి. ఈ ప్రదేశాల నుండి చుట్టు పక్కల అందాలను వీక్షించవచ్చు.

గుడిస హిల్ స్టేషన్

మారేడుమిల్లికి సుమారు 50 కిలోమీటర్ల దూరం మారేడుమిల్లి మండలం పుల్లంగి పంచాయతీ గుడిస గ్రామం ఉంది. ఇక్కడ ఎత్తైన కొండ ప్రాంతం ఎంతో ఆకర్షించేవిధంగా ఉంటుంది. ఇది గుడిస పర్యాటక కేంద్రంగా పేరుపొందింది. శీతాకాలంలో తెల్లవారుజామున పాల సముద్రాన్ని తలపించేలా, భూమి ఆకాశం ఒక్కటైందా అన్న విధంగా పొంగ మంచు కొండలపై కమ్మేస్తుంది. దీనిని తిలకించడానికి ఎపితో పాటు పలు రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తూ ఉంటారు. తెల్లవారుజామున మంచు అందాలను, ఆ సమయంలో సూర్యోదయాన్ని చూడటానికి రాత్రి అక్కడే టెంట్లు వేసుకొని స్టే చేస్తారు.

ఎప్పుడు సందర్శించాలి?

మామూలుగా ఐతే మారేడుమిల్లిని వర్షాకాలం తరువాత సందర్శించాలి. వర్షాకాలంలో వర్షాలు అధికంగా ఉంటాయి కాబట్టి అడవుల్లో జారిపడే అవకాశం లేకపోలేదు. ఈ ప్రదేశం సంవత్సరం పొడవునా రాత్రిళ్ళు చల్లగా, ఉదయం వేడిగా ఉంటుంది. వేసవిలో సందర్శన ఒక కొత్త అనుభూతిని ఇస్తుంది.

ఎక్కడ స్టే చేయాలి?

రంపచోడవరంలో అయితే ప్రైవేటు రిసార్ట్స్ చాలానే ఉన్నాయి. ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారు నిర్వహించే రిసార్ట్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి.

బర్డ్స్ నెస్ట్ రిసార్ట్స్ అండ్ టూరిజం

రంపచోడవరం మారేడుమిల్లికి మధ్యలో ఉన్న సున్నంపాడు గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో బర్డ్స్ నెస్ట్ అనే ప్రైవేటు రిసార్ట్స్ ఉంది. ఇక్కడికి వచ్చే పర్యాటకులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా బర్డ్స్ నెస్ట్ రిసార్ట్స్ వారు భోజనం తయారు చేస్తారు. స్విమ్మింగ్ పూల్, వాగులో బోటింగ్, చిన్నపిల్లలు ఆడుకొనే పరికరాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. దీంతో పాటు రంపచోడవరం మండలంలో ఆర్కా రిసార్ట్స్, మారేడుమిల్లి మండలంలో సెవెన్ హిల్స్ రిసార్ట్స్, డ్రీమ్ వ్యాలీ రిసార్ట్స్, సత్య గౌరి రూమ్స్, సత్య రూమ్స్, విజయ రెసిడెన్సీ వంటి ప్రైవేటు రిసార్ట్స్, హోటళ్లు అనేకం ఉన్నాయి.

అటవీశాఖ ఎకో రిసార్ట్స్

అలాగే ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ వారు ఎకో- టూరిజం ప్రాజెక్ట్‌లో భాగంగా వనవిహారి ఎకో రిసార్ట్, జంగిల్ స్టార్ ఎకో రిసార్ట్స్‌ను నిర్వహిస్తున్నారు. వనవిహారి రిసార్ట్‌లో చాలా గదులు అద్దెకు లభిస్తాయి. ఇందులో ఏసీ, నాన్ ఏసీ గదులు అందుబాటులో ఉన్నాయి. జంటలకు, చిన్న చిన్న గ్రూప్‌లుగా వచ్చేవారికి ఈ రిసార్ట్ సూచించదగినది. జంగిల్ స్టార్ రిసార్ట్ 10 -20 మంది కలిసి గ్రూప్‌లుగా వచ్చేవారికి సూచించదగినది. టెంట్ వసతి, రాత్రుళ్ళు చలి మంటలు ఇక్కడి ప్రత్యేకతలు. ఫుడ్ ఊరికి దూరంగా ఉండటం ప్రతికూలతగా చెప్పవచ్చు.

బేంబో చికెన్

మారేడుమిల్లిలో బేంబో చికెన్ ప్రత్యేక వంటకం. ఎదురు బొంగులో చికెన్ వేసి మంటలో కాలుస్తారు. దీని రుచి స్టార్ హోటళ్ళలో కూడా రాదు. అంత బాగుంటుంది. ఒక్క చుక్క కూడా ఆయిల్ వాడకుండా తయారు చేసే ఈ చికెన్‌ను తప్పకుండా రుచి చూడాలి.

మారేడుమిల్లి, రంపచోడవరంలో చిన్న చిన్న హోటళ్ల అనేకం ఉన్నాయి. మారేడుమిల్లిలో తినటానికి సూచించదగిన ప్రదేశం వనవిహారి రిసార్ట్ క్యాంటీన్. ఇక్కడ ఫుడ్ అమోఘం. ఇక్కడ బేంబొ చికెన్ రుచి చూడొచ్చు. బేంబొ చికెన్ తినటానికి స్పెషల్‌గా హోటల్ అంటూ ఏదీ లేదు. అన్ని హోటళ్ళలో ఈ చికెన్ వండుతారు.

టూర్ ప్యాకేజీలు

మారేడుమిల్లికి టూర్ ప్యాకేజీలు ఉన్నాయి. మారేడుమిల్లి, రంపచోడవరం ట్రావెల్ ఏజెంట్‌నైనా సంప్రదించి రెండురోజుల పాటు వనవిహారంలో ఉండవచ్చు. కొన్ని ట్రావెల్ సంస్థలు గైడ్‌ను పెట్టి వసతి, భోజనాలు, రవాణా సదుపాయాలను కల్పిస్తున్నాయి.



గుడిస హిల్ స్టేషన్ వద్ద పాల సముద్రాన్ని తలపించే దృశ్యం

బర్డ్స్ నెస్ట్ రిసార్ట్‌లో స్విమ్మింగ్ పూల్

అటవీశాఖ వారి వనవిహారి ఎకో రిసార్ట్స్

భూపతిపాలెం రిజర్వాయర్

ప్రజాశక్తి
44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

పి.బాలురెడ్డి ప్రధానోపాధ్యాయులు
పి.ఉదయగిరి ప్రసాద్ డిప్యూటీ వార్డెన్
మరియు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది
GTWAH SCHOOL
డి.భీమవరం, అడ్డతీగల మండలం,
అల్లూరి సీతారామరాజు జిల్లా.

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం
ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే నినాదంతో
దిన దినదినాభివృద్ధి చెందుతూ
44వ వసంతంలోకి అడుగిడిన
శుభసందర్భంగా
హృదయపూర్వక శుభాకాంక్షలతో...
శ్రీమతి ఎం.నాగలక్ష్మి ప్రధానోపాధ్యాయురాలు
మరియు సిబ్బంది
ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల
దాలిపాడు గ్రామం, వై.రామవరం మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా.
వెంకట్‌రెడ్డి ప్రధానోపాధ్యాయులు
ఎం.రామకృష్ణ డిప్యూటీ వార్డెన్
మరియు సిబ్బంది
ఆశ్రమ ఉన్నత పాఠశాల
కోట గ్రామం, వై.రామవరం మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా.

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం
ప్రజాశక్తి
44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో ప్రతి అక్షరం-ప్రజల పక్షం
అనే నినాదంతో 44వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు హృదయపూర్వక శుభాకాంక్షలు
విజయ రంగారావు ఎంపిడిఓ
డి.చిన్నబ్బులు ఇ.ఓ. పి.ఆర్.డి.
మండల పంచాయితీ కార్యదర్శులు
మరియు పంచాయితీ కార్యాలయ సిబ్బంది
మండల ప్రజాపరిషత్ కార్యాలయం
అడ్డతీగల మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా.

చెంతనే భద్రాచలం

విలీన మండలాల ప్రజలకు అన్నింటికీ ఇదే ఆధారం

భద్రాచలం వ్యూ

ప్రజాశక్తి -ఎటపాక

దక్షిణ భారతదేశ అయోధ్యగా పేరుగాంచిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రాచలం. ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లుతోనే పోరాటాలకు నెలవుగా ఉంది. రాష్ట్ర విభజన తర్వాత భద్రాచలం మండలంలోని భద్రాచలం పట్టణం మినహా మిగతా గ్రామాలను ఎటపాక కేంద్రంగా ప్రత్యేక మండలంగా ఏర్పాటుచేశారు. భద్రాచలానికి రెండు దిక్కులా గోదావరి సరిహద్దు అయితే మరో రెండు వైపులా ఎటపాక మండలం సరిహద్దు. మండలం ముక్కలైనా మండల ప్రజలు మాత్రం తెల్లారితే భద్రాచలంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఎటపాక ఒక్క మండలమే కాదు చింతూరు, విఆర్.పురం, కూనవరం మండల ప్రజలకు కూడా ఆయువుగా భద్రాచలం ఉంది. నిత్యం కూరగాయలు, నిత్యావసర సరుకులు, గృహోపకరణాలు, దుస్తులు, నగలు, విద్య, వైద్యం, వ్యవసాయ అవసరాలు, వ్యాపారం తదితరాలన్నింటికి భద్రాచలం వెళ్లాల్సిందే. భద్రాచలంతో ముంపు ప్రజల అనుబంధం అంతగా పెనువేసుకుపోయింది. భద్రాచలంతో అనుబంధం రాష్ట్రాల విభజనతో సంబంధం లేనిది. ఈ నాలుగు మండలాల ప్రజల కొనుగోలుతోనే భద్రాచలం వ్యాపారాలు సాగుతున్నాయనడంలో అతిశయోక్తి లేదు. భద్రాచలం చుట్టూ వరద నీరు చేరితే భద్రాచలంలోని వ్యాపార సముదాయాలన్నీ నిర్మానుష్యంగా మారుతాయి. ఈ ఒక్క ఉదాహరణ చాలు నాలుగు మండలాల కొనుగోలుతో భద్రాచలంలో వ్యాపారం ఏ విధంగా సాగుతుందో తెలుస్తోంది. గత రెండేళ్ల నుంచి 4 ముంపు మండలాల్లో వ్యవసాయం నష్టాల బాటలో, అప్పుల ఊబిలో కూరుకుంది. దీంతో ప్రజల కొనుగోలు శక్తి పడిపోయింది. ఈ ప్రభావం భద్రాచలం వ్యాపారంపై పడింది. నిత్యావసరాలు మినహా గృహోపకరణాలు, నగలు, దుస్తుల, వాహనాల కొనుగోలు భారీగా తగ్గింది.

వైద్యానికి భద్రాచలమే దిక్కు

నాలుగు మండలాల ప్రజల వైద్యానికి భద్రాచలం పెద్ద దిక్కుగా ఉంది. పేద, గిరిజనులకు భద్రాచలం ఏరియా ఆసుపత్రిలోనే వైద్యం పొందుతున్నారు. నాలుగు మండలాల్లో అత్యధిక శాతం గర్భిణులకు కాన్పులు చేసేది భద్రాచలం ఆసుపత్రులే. కూనవరం, చింతూరు సిహెచ్‌సి లో చేయలేని వైద్యానికి కూడా భద్రాచలం హాస్పిటలే దిక్కుగా ఉంది. భద్రాచలం ఏరియా ఆసుపత్రితో పాటు పదుల సంఖ్యలో ఉన్న ప్రైవేట్ హాస్పిటల్స్ కూడా నాలుగు మండలాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాయి. ఈ నాలుగు మండలాల్లో ఎక్కడ యాక్సిడెంట్ అయినా క్షతగాత్రులను, మృతదేహాలను భద్రాచలం ఏరియా ఆసుపత్రికే తరలిస్తారు.

ఐదు పంచాయతీల విలీన నినాదం
రామాలయ భూముల వివాదం

భద్రాచలం పట్టణానికి సరిహద్దులుగా ఉన్న ఐదు పంచాయతీలు ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు, గుండాల, పురుషోత్తమపట్నాన్ని భద్రాచలంలో కలపాలంటూ రాష్ట్ర విభజన సమయం నుంచే ఆయా పంచాయతీల ప్రజలు ప్రభుత్వాల ముందు ఒక డిమాండ్ ఉంచారు. ఈ గ్రామాల ప్రజల డిమాండ్‌కు మద్దతుగా భద్రాచలం పట్టణ ప్రముఖులు, రాజకీయ పార్టీలు కూడా సంఘీభావం ప్రకటించాయి. ఎటపాక జటాయువు, ఉష్ట గుండాల, పురుషోత్తమపట్నం రాములోరి భూములు, సరిహద్దు రవాణాకు అనుకూలంగా కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు గ్రామ పంచాయతీలు కలపాలనేది ఒక వాదన. ఎటపాక మండలం మొత్తం తెలంగాణలో కలపాలని మరొక వాదన, కాదు విలీన మండలాలను కూడా తెలంగాణలో కలపాలనే వాదన కూడా ఉంది. ఈ వాదనలకు కారణం ప్రభుత్వాల మీద వ్యతిరేకం కాదు అను నిత్యం భద్రాచలంపై ఆధారపడటమే కారణం.

వరద సమాచారం అక్కడి నుంచే...

వర్షాకాలం వచ్చిందంటే ముంపు మండలాల ప్రజలు బిక్కు బిక్కుమంటూ గడపాల్సి వస్తోంది. వరద సమాచారం కూడా భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహాన్ని బట్టే ముంపు ప్రాంతాల ప్రజలు ఒక అంచనాకు వస్తుంటారు. పాపికొండలు పర్యాటక కేంద్రానికి వెళ్లాలన్నా తొలుత భద్రాచలం పుణ్యక్షేత్రంలో దర్శనం చేసుకొని అక్కడి నుంచే పాపికొండలు విహార యాత్రకు టికెట్‌లు తీసుకొని వెళ్తుంటారు. ముంపు మండలాల పర్యటనకు వచ్చే అధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా భద్రాచలంలో రాములోరిని దర్శించుకోవాల్సిందే. ఇలా ప్రతి విషయంలో ప్రతి ఒక్కరికీ భద్రాచలంతో అనుబంధం ఏర్పడింది.

ఆంధ్ర అందాల ఊటీ.. మారేడుమిల్లి ఘాటీ...

సోయగాల ఒంపుసొంపులతో ప్రకృతి పరిచిన పచ్చ తివాచీ



ప్రజాశక్తి - చింతూరు

ఆంధ్రుల అందాల ఊటీగా మారేడుమిల్లి ఘాటీ ప్రకృతి పరిచిన పచ్చని తివాచీలా నిత్యం హరితారణ్యాలను తలపిస్తోంది. ఎత్తయిన పర్వతాలు, వాటిపై నుంచి జాలువారే జలపాతాలు మండు వేసవిలో కూడా చల్లని వాతావరణం కలిగి ఉదక మండలంలోని ఊటీని తలపిస్తూ ఉంది. చింతూరు మండల కేంద్రం నుంచి 15 కిలోమీటర్ల దూరం తూర్పు కొండల వైపు ప్రయాణిస్తే ఎత్తయిన శిఖరాలపై రహదారి వంపులు తిరిగిన పాములా కనిపిస్తుంది. తులసిపాక నుంచి మారేడుమిల్లి వరకు ఉన్న 30 కిలోమీటర్ల రహదారి పొడవునా ఎంతో ఆహ్లాదకరమైన ప్రకృతి అందాలు దర్శనమిస్తాయి. రాత్రి వేళల్లో చిరుత పులుల సంచారం, అడవి గేదెలు, ఎలుగుబంట్లు, కొండచిలువలు కూడా కనిపిస్తుంటాయి. గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఇప్పటికే అరుదైన జంతువులు కనుమరుగయ్యాయి. పాపికొండలు అభయారణ్యం వన్యప్రాణులకు ఆలవాలంగా ఉండేది. పురాణ ఇతిహాసాల్లో వాలి సుగ్రీవుల కథకు ఇక్కడ ఎన్నో ఆధారాలు ఉన్నాయి. వాలిసుగ్రీవుల గుట్టలు ఇప్పటికీ దర్శనమిస్తాయి. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నడయాడిన అడవి. శీతాకాలంలో మంచు దుప్పటి ముసుగులో తెల్లని మేఘాలు ఇక్కడ పర్వతాలను ముద్దాడుతున్నట్లు ముచ్చటైన దృశ్యాలు కనువిందు చేస్తాయి. మండు వేసవిలో కూడా వెండి మబ్బులు నిండి ఉంటాయి. ప్రతిరోజూ ఈ ప్రాంతంలో చిరుజల్లులు పడుతుంటాయి. ఇంత అందమైన ఆహ్లాదకరమైన ఈ ఘాటీలో ఆదమరచి ప్రయాణిస్తే ప్రమాదాలు తప్పవు. అడవిలో దొరికే వెదురు బొంగులతో ఇక్కడి ప్రజలు మాంసాన్ని కాల్చుకు తినే ఆదిమ కాలం నాటి పద్ధతి ఉంది. దాన్నే నేడు బొంగు చికెన్ పేరుతో పిలుస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో అనేక బొంగు చికెన్ కుటీరాలు వెలిశాయి. ఆదివాసీల జీవన చిత్రానికి అద్దంపడుతూ వైవిధ్యభరితంగా ఉంటుంది. స్వచ్ఛమైన గాలి, కలుషితం లేని నీరు, ప్రతి జీవీ స్వేచ్ఛా వాయువులు తీసుకునేలా ప్రకృతి ఉంటుంది. ఎంతో విలువైన కర్ర తేనె, పుట్ట తేనెను గిరిజనులు సేకరిస్తుంటారు. ఏటా కోట్ల రూపాయల విలువ చేసే బీడీ ఆకు (తునికాకు) ఈ ప్రాంతంలోనే లభిస్తుంది. మన దేశానికి ప్రసిద్ధ దేవాలయాల వద్ద ఏర్పాటుచేసే ధ్వజస్తంభాలకు నాణ్యమైన టేకు వృక్షాలు ఇక్కడ నుంచే కొనుగోలు చేస్తారు. ఇంతటి విలువైన అటవీ సంపద, సహజవనరులు కలిగిన చింతూరు మండల కేంద్రం పర్యాటకానికి ఎంతో దోహదపడుతుంది. వంపులు తిరిగి ఎత్తయిన కొండలపై నుంచి నిత్యం ప్రవహించే సోకులేరు వాగు అత్యంత రమణీయంగా ఉంటుంది. పర్వతాల నడుమ ప్రకృతి గీచిన జలతారు దృశ్యం కన్నుల పండుగ చేస్తోంది. ప్రతి ఒక్కరూ జీవితకాలంలో ఏదో ఒక రోజు ఈ ప్రాంతాన్ని సందర్శించి ప్రకృతి అందాలను ఆస్వాదించాలని కొందరు అభిప్రాయపడుతుంటారు.



మూడు రాష్ట్రాల సంగమం కల్లేరు

శబరి, సీలేరు జీవనదుల కలయిక వేదిక చింతూరు
- ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం
- బహుభాషలకు ఆలవాలం చింతూరు వారపుసంత

చత్తీస్‌ఘడ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ సంగమం ప్రాంతం ఇదే..

ప్రజాశక్తి-చింతూరు

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో అనేక అపూర్వమైన సందర్శనీయ ప్రదేశాలున్నాయి. జిల్లాలోనే ఎంతో దట్టమైన అటవీ ప్రాంతం, జీవనదులు, జంతుజాలం, విలువైన కలప, ఆయుర్వేద వైద్యంలో ఉపయోగపడే ఔషధ మూలికలు, నాణ్యత గల పేపర్ తయారీకి లభించే విలువైన వెదురు ఈ ప్రాంతంలో పుష్కలంగా లభిస్తుంది. ఆదివాసీ గిరిజన సంస్కృతి, సాంప్రదాయం, రేలా నృత్యాలు, కొమ్ము డోలు విన్యాసాలతో కూడిన విభిన్న సంస్కృతి గల ప్రాంతం. ఆదిమ మానవులు ఉపయోగించే విల్లంబులు నేటికి ఈ ప్రాంత ఆదివాసీలు భూమి పండుగ రోజున ఉపయోగిస్తారు. దేశంలోనే మరెక్కడా లేని విధంగా గిరిజన కోయ భాషను మాట్లాడుతారు. భూమి పండుగ మూడు రోజులు వరుసగా గూడెం యువకులు అందరూ కలిసి విల్లంబులు పట్టుకొని సమీప అడవుల్లోకి వేటకు బయలు దేరుతారు. బాణాలతో జంతువులను వేటాడి గ్రామం లోనికి తీసుకు వచ్చి వాటాలు వేసి గ్రామస్తులు అందరూ పంచుకుంటారు. ఇది గ్రామ ఐక్యతకు సమానత్వానికి నిదర్శనం. మూడు రాష్ట్రాల కూడలిగా ఉన్న చింతూరు మండల కేంద్రం బహు భాషలు మాట్లాడే వ్యక్తులు కనిపిస్తుంటారు. హిందీ, కోయ, ఒడియా, బెంగాలి భాషలు మాట్లాడే వారు ఈ ప్రాంతంలో జరిగే వారపు సంతలో వ్యాపార నిమిత్తం వారం వారం వస్తుంటారు. చింతూరు మండలం కల్లేరు వద్ద సీలేరు నది ఒరిస్సా రాష్ట్రంలోని కలహండిలో పుట్టిన శబరి నది రెండు ఇక్కడ సంగమిస్తాయి. సీలేరు నదీజలాలు నల్లగా ఉండి నీలం వర్ణంలో ప్రవహిస్తుంది. శబరి నది తెల్లగా నురగలతో కూడి ఉంటుంది. రెండు నదులు కలిసే చోట మధ్యలో ఒక గీతల ఏర్పడి కొంతదూరం వరకు వేరువేరుగా ప్రవహిస్తాయి. అలా ప్రవహించి కలిసి ప్రవేశించిన ఈ రెండు నదులు కూనవరం వద్ద గోదావరి నదిలో కలిసి త్రివేణి సంగమంగా మారుతుంది.

కల్లేరు నుండి చూస్తే ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ మూడు రాష్ట్రాల సరిహద్దులు మనకు ఒకేసారి కనిపిస్తాయి. ఈ అరుదైన దృశ్యం చూడాలంటే తప్పకుండా చింతూరు వచ్చి ఎనిమిది కిలోమీటర్లు కల్లేరు గ్రామం వెళ్లాల్సి ఉంటుంది. శబరి సీలేరు జీవనదులు ఏటికేడాది ప్రవహిస్తూనే ఉంటాయి. కేవలం 15 నిమిషాల్లో మూడు రాష్ట్రాల్లో ప్రవేశించి పర్యటించి రావచ్చు. ఎక్కడా ఎటువంటి అభ్యంతరాలు ఆటంకాలు ఉండవు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ఆయా రాష్ట్రాలకు చెందిన పోలీసుల రక్షణ ఉంటుంది. ఇక్కడకు వస్తే ఎవరికైనా మూడు రాష్ట్రాలను సందర్శించామన్న ఒక అపూర్వ అనుభూతి కలుగుతుంది. వేషభాషలు, భౌగోళిక స్వరూపాలు, ఆహారపుటలవాట్లు అన్ని మనకు విభిన్నంగా కనిపిస్తాయి. పర్యాటకంగా ఎంతో ప్రాముఖ్యం ఉన్న కల్లేరును సందర్శించడం మధురానుభూతిని మిగులుస్తుందనడంలో సందేమం లేదు.

సమిష్టితత్వానికి ప్రతీక భూమి పండుగ

- ఆదివాసీ పురుషులంతా అడవిలో వేట
- మహిళలు చందాలు సేకరణ
- వచ్చిన వాటితో ఐక్యంగా జాతర నిర్వహణ

ప్రజాశక్తి-చింతూరు

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలు ప్రతి సంవత్సరం జూన్ నెలలో నిర్వహించుకునే భూమి పండగ సమిష్టి తత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. ఆదివాసీ గిరిజనులు తమ మొదటి పండుగ అయిన భూమి పండుగను ఎవరి ఇంట్లో వారు కాకుండా చిన్నా పెద్ద తేడా లేకుండా ఊరు ఊరంతా కలిసి సమిష్టిగా కలిసి చేసుకుంటారు. ప్రతి ఏటా తొలకరి ప్రారంభంలో ప్రకృతి పచ్చదనంతో నిండిన సమయంలో ఆదివాసీలు తమ ఆచార, సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగా ఊరి జనమంతా సమావేశమై భూమి పండుగ ఎప్పుడు చేయాలో గ్రామ పెద్దలు, పూజారి పటేల్‌లతో చర్చించి నిర్ణయిస్తారు.

భూమి పండుగతోనే ఆదివాసీల పండుగలు ప్రారంభం

భూమి పండుగ చేయకుండా తమ గ్రామంలో కానీ ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీలు మిగతా ఏ పండుగలను, ఉత్సవాలను నిర్వహించారు. తమ కులదైవాలను కూడా భూమి పండుగ తర్వాతనే కొలుస్తారు. ఈ పండుగ ప్రత్యేకత ఏమిటంటే.., గ్రామంలో ఉన్న పురుషులందరూ విల్లంబులు పట్టుకుని సమీప అడవుల్లో జంతువుల వేటకై వెళతారు. వేటకు వెళ్లే తమ గ్రామ యువకులకు మహిళలు ఎదురెళ్లి తిలకాలు దిద్ది క్షేమంగా వెళ్లి వేటతో లాభంగా రావాలని కోరుతూ ఆదివాసీ గీతాలను ఆలపిస్తూ సాగనంపుతారు. మగవారు అలా అడవికి వెళ్ళిన అనంతరం గ్రామంలో ఉన్న మహిళలందరూ కలిసి సమిష్టిగా రహదారులపై అడ్డంగా కర్రలు పట్టుకొని ఒకరినొకరు గొలుసుల పట్టుకొని సామూహిక నృత్యం చేస్తూ వాహనాలను ఆపుతూ రేలా పాటలు పాడుతూ భూమి పండుగ చందాలను సేకరిస్తారు. అలా సేకరించగా వచ్చిన డబ్బులను భూమి పంగడ నిర్వహణకు ఖర్చు చేస్తారు. అడవికి వేటకు వెళ్లి వేటాడి తెచ్చిన జంతువులను గ్రామంలో అందరూ కలిసి వాటాలు వేసుకొని సమానంగా పంచుకుంటారు. ఆదివాసీల పండుగలకు సంబంధించి అడవిలో వేట ఒక ముఖ్య ఘట్టం. ఆదిమ కాలం నుండి తమ పూర్వీకులు ఆచరిస్తున్న భూమి పండుగను మరువకుండా వారి భావితరాలకు అందించే క్రమంలో ప్రతి సంవత్సరం జూన్ నెల మొదటి వారంలో ఈ పండుగను ప్రారంభిస్తారు. ఒక్కో గ్రామంలో ఒక్కో రోజు భూమి పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు.

మహిళలు కోడిగుడ్డును బాణంతో కొట్టడంతో ప్రారంభం

భూమి పండుగ ప్రారంభానికి ముందు గ్రామంలో మహిళలు కోడుగుడ్డుకి కుంకం తిలకం దిద్ది ఒక ప్రదేశంలో పెట్టి వేటకు వెళ్లే విల్లంబులను ఎక్కుపెట్టి గురి చూసి గుడ్డును కొడతారు. అలా చేస్తే గురి తప్పకుండా మగవారు అడవికి వెళ్లి వేటను కచ్చితంగా జంతువులు వేటాడి తీసుకు వస్తారని ఒక నమ్మకం. దీంతో భూమి పండగ ప్రక్రియ ప్రారంభమైనట్లు. ఆ తరువాత మిగిలిన ఘట్టాలు చేపడతారు.

నృత్యాలు చేస్తూ చందాలు వసూలు చేస్తున్న గిరిజన మహిళలు

ప్రజాశక్తి
44 వార్షికోత్సవం
ప్రజాశక్తి
44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో
44వ వసంతంలోకి అడుగిడిన ప్రజాశక్తి దినపత్రికకు
హృదయపూర్వక శుభాకాంక్షలు
ప్రజాశక్తి శ్రేయోభిలాషి
ఎటపాక మండలం,
అల్లూరి సీతారామరాజు జిల్లా.

ప్రజాశక్తి
44వ వార్షికోత్సవం
ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే నినాదంతో
దిన దినదినాభివృద్ధి చెందుతూ
44వ వసంతంలోకి అడుగిడిన
శుభసందర్భంగా
హృదయపూర్వక శుభాకాంక్షలతో...
శ్రీమతి రామతులసి (ATWO)
రంపచోడవరం మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా.
గంటిమళ్ల సత్యనారాయణ (HWO)
రంపచోడవరం మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా.
డిగ్రీ బాలుర వసతి గృహము
రంపచోడవరం మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా.

ప్రజాశక్తి
44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ప్రతి అక్షరం
ప్రజల పక్షం
అనే నినాదంతో
44వ వసంతంలోకి
అడుగిడిన
ప్రజాశక్తి
దినపత్రికకు
హృదయపూర్వక
శుభాకాంక్షలు

కొండా జాకబ్
సర్పంచ్,
మారేడుమిల్లి
మరియు
సిబ్బంది
వి.పరమేశ్వరి
పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయతీ కార్యాలయం
మారేడుమిల్లి, మారేడుమిల్లి మండలం
అల్లూరి సీతారామరాజు జిల్లా.

మన్యం మారాజు అల్లూరి సీతారామరాజు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : అల్లూరి సీతారామరాజు వ్యక్తిత్వం బహుముఖమైనది. మహోన్నతమైనది. మిక్కిలి విశిష్టమైనది. ఆయన భారతీయత సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు రూపం. ఆయనలో భారతీయుడు, సంఘసంస్కర్త, న్యాయమూర్తి ఉన్నాడు. వెరసి విప్లవ వీరుడయ్యాడు. ఆయన అత్యంత చిన్న వయసులోనే స్వరాజ్యసాధనకు సర్వసంగ పరిత్యాగం చేసిన విరాగి. ఆశ్రమ లాసం గడిపిన తపస్వి. సౌకర్యాలు కోరని ఆదర్శమూర్తి. దీనజనుల సేవ చేయడానికి వివాహాన్ని కూడా త్యజించిన మహనీయుడు. అందుకే మన్యం ప్రజలకు ఆయనమాట వేద వాక్కు. వారంతా ఆయన అడుగుజాడల్లో నడిచారు. ఆయన బ్రిటీష్ పాలకులకు, భూస్వాములకు, ముఠాదారులకు, వడ్డీ వ్యాపారులకు, దోపిడీదారులకు సింహ స్వప్నం. బ్రిటిష్ పాలకుల పాలనను తీవ్రంగా వ్యతిరేకించారు. మన్యం ప్రజలను ఒక్క తాటిపై నడిపిన వీరుడు సీతారామరాజు. మన్యం ప్రజలను బ్రిటిష్ పాలకులు చిత్రహింసలకు గురి చేయడం, మన్యవాసులు మానప్రాణాలను హరించడం వంటి ఘటనలను అల్లూరి సీతారామరాజు సహించలేక తిరుగుబాటు చేపట్టారు. సీతారామరాజు 1887 జులై 4న విశాఖ జిల్లా పాండ్రంగిలో జన్మించారు. సీతారామరాజు తల్లిదండ్రులు సూర్యనారాయణమ్మ, వెంకటపతిరాజు. మన్యవాసులు ఆరాధ్యుడైన అల్లూరి 1922 ఆగస్టు 22 నుంచి 1924 జులై 16వ తేదీ వరకు మన్యంలో అలుపెరగని పోరాటం చేశారు. 1922 సంవత్సరంలో రామరాజు మన్యం ప్రజలను విప్లవానికి సిద్ధం చేశారు. విప్లవ దళాలతో వివిధ పోలీస్ స్టేషన్లపై రామరాజు దాడులు చేయించారు. విశాఖ జిల్లాలో 1922 ఆగస్టు 22న మన్యంలో తిరుగుబాటు ప్రారంభమైంది. చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై 300 మంది విప్లవకారులతో రామరాజు దాడిచేసి, అక్కడి రికార్డులను చింపివేశారు. మందుగుండు సామాగ్రి, తుపాకులను ఆయనతో తీసుకెళ్తున్నట్లు వివరాలను రిజిస్టర్‌లో రాశారు. మరొకటి రోజు 1924 ఆగస్టు 23న కృష్ణదేవిపేటపై దాడి చేసి తుపాకులను, మందు గుండు సామాగ్రిని తీసుకెళ్లారు. 1924 ఆగస్టు 24న రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్‌పై దాడిచేసి తుపాకులను స్వాధీనం చేసుకోవడంతో పాటు పోలీస్ స్టేషన్‌లో బందీగా ఉన్న ముట్టడం వీరయ్య దొరను విడిపించి తీసుకెళ్లారు. అక్టోబర్ 15న అడ్డతీగల, అక్టోబర్ 19న రంపచోడవరం పోలీస్ స్టేషన్లను పట్టపగలే ముట్టడించారు. సీతారామరాజు బ్రిటిష్ సైనికులను ముప్పుతిప్పలు పెట్టి తెలుగు వాడి పౌరుష ప్రతిపాలను ప్రపంచానికి చాటారు. బ్రిటిష్ పాలకులకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. గిరిజనులను ఐక్యం చేసి వీరయ్యదొర, కంకిపాడు, గాం గట్టందొర, మల్లుదొర, ఎండు పడాల్, ముక్కుడు శంకోజీ, వేగిరాజు సత్యనారాయణరాజు, గోకిరి ఎర్రేసు, మోదిగాడు, లాగరాయి పితురి వీరుడు వీరయ్యదొరల వంటి సుమారు 200 మంది సాహస వీరులతో అలుపెరగని పోరాటం చేశారు. సీతారామరాజు గిరిజనులకు కొండపోడు భూములపై హక్కు ఉండాలని, అటవీ ఉత్పత్తులు సేకరించుకుంటారని, శిస్తు కట్టరని చెప్పేవారు. సీతారామరాజు సారథ్యంలో మన్యం తిరుగుబాటు ఎంతగానో విజయవంతమైంది. ఏజెన్సీ వాసుల కోసం 1924 మే 7న ఆయన వీర మరణం పొందారు. అల్లూరి నడియాడిన, ఎంతో చరిత్ర కలిగిన మన్యం ప్రాంతాన్ని పాలకులు అభివృద్ధి చేయాలని ఏజెన్సీ ప్రాంత వాసులు కోరుతున్నారు.

నాడు అల్లూరి దాడి చేసిన రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ ఇదే..

పర్యాటకులను ఆకర్షిస్తున్న...

పింజరికొండ జలపాతం

ప్రజాశక్తి - అడ్డతీగల

తూర్పు ఏజెన్సీలో పర్యాటకులను ఆకర్షించే పర్యాటక ప్రదేశం పింజరికొండ. ఈ జలపాతానికి రాజమండ్రి నుంచి 45 కిలోమీటర్లు, గోకవరం నుంచి 20 కిలోమీటర్లు, ఏజెన్సీ గంగవరం నుంచి మరో 12 కిలోమీటర్లు, అడ్డతీగల మండల కేంద్రం నుంచి ప్రయాణం చేసి ఈ పర్యాటక కేంద్రానికి చేరుకోవచ్చు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, కృష్ణ జిల్లాల నుంచి ఈ జలపాతం వద్దకు వేలాదిమంది పర్యాటకులు వస్తూ ఉంటారు. ఈ పర్యాటక కేంద్రంలో సుమారుగా 100 అడుగులు ఎత్తు నుంచి నీరు కిందకి జాలువారుతూ ఉంటుంది. ఈ అందాలను తిలకించడానికి కార్తీకమాసంలో పర్యాటకులు తాకిడి ఎక్కువగా ఉండడంతో ఈ జలపాతం వద్ద భద్రతా ఏర్పాట్లు చేశారు. గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగినా పర్యాటకులు మాత్రం తగ్గలేదని ఈ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. ఈ జలపాతం వద్ద ప్రకృతి సిద్ధంగా వెలిసిన పురాతన శివాలయం ఉంది. ఆ శివాలయం వద్దకు పూర్వకాలం నుంచి కూడా సంతానం లేని వారు వచ్చి మొక్కుకుంటే పిల్లలు పుడతారని నమ్మకం ఉంది. శివరాత్రి రోజున ఎక్కడ నుంచి ఎంతమంది వచ్చినా పింజరి కొండ గ్రామస్తులు కమిటీగా ఏర్పడి భోజనాలు ఏర్పాటు చేస్తారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా కళాజాతాలను ఏర్పాటు చేస్తారు.

ప్రస్తుతం జలపాతం వద్ద మినీ పవర్ ప్లాంట్ నిర్మాణం చేయడంతో కాస్త ఇబ్బందులు కలుగుతున్నాయని పర్యాటకులు చెబుతున్నారు.



పింజరికొండ జలపాతం

ప్రజాశక్తి
44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
సిహెచ్. సత్యనారాయణ దొర H.M.
పి.సోమన్నదొర SGT
పి.వెంకటేశ్వర్లు దొర SGT
కె.రాముడు SGT
పి.వెంకటేశ్వరరావు SGT
ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే నినాదంతో దిన దినదినాభివృద్ధి చెందుతూ 44వ వసంతంలోకి అడుగిడిన శుభసందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలతో...
GTWAUP SCHOOL
ఊట్ల, రంపచోడవరం మండలం
అల్లూరి సీతారామరాజు జిల్లా.

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం
అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం
అనే నినాదంతో
44వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు
హృదయపూర్వక శుభాకాంక్షలు
పి.రాజేంద్రబాబు
డి.ఇ. రంపచోడవరం
బి.నారాయణరావు
ఎ.ఇ. మారేడుమిల్లి
మరియు
కార్యాలయ సిబ్బంది
RWS & S
మారేడుమిల్లి మండలం
అల్లూరి సీతారామరాజు జిల్లా.

ఎం.ఆనందబాబు ప్రధానోపాధ్యాయులు
గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల-వీరవరం
అడ్డతీగల మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా.

ప్రజాశక్తి
44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ప్రసాద్
ప్రధానోపాధ్యాయులు
మరియు
ఉపాధ్యాయ
సిబ్బంది

ఎం.సిహెచ్.విష్ణుదొర
హెచ్.డబ్ల్యు.ఒ.,
గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల
అడ్డతీగల మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా.

ఆదర్శ ప్రజాప్రతినిధులు

కుంజా బొజ్జి

సున్నం రాజయ్య

చట్టసభల్లో ఆదివాసీల గొంతు వినిపించిన నేతలు

ప్రజాశక్తి - అల్లూరి డెస్క్

వారి జీవితం ప్రజలకే అంకితం. వారి గళం.. ఆదివాసీల స్వరం. చట్టసభల్లో గిరిజనుల వెతలను కళ్లముందుంచి సమస్యల పరిష్కారానికి వారు చేసిన కృషి చిరస్మరణీయం. సామాన్యులుగా ఉంటూ.. పోరాట తెగువతో అసామాన్య విజయాలు సాధించిన వారే కుంజా బొజ్జి, సున్నం రాజయ్య. వీరు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని భద్రాచలం కేంద్రంగా ఎర్రజెండాను రెపరెపలాడించారు. వారి పోరాట గురుతులను నేటికీ ఆదివాసీలు గుర్తుచేసుకుంటూ ఉత్తేజం పొందుతారు.

ఏజెన్సీ సుందరయ్య కుంజా బొజ్జి

కుంజా బొజ్జికి ఏజెన్సీ సుందరయ్యగా పేరు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ సాధారణ జీవితం గడపడం ఆయన సొంతం. ఎర్రజెండా అంటే చిన్ననాటి నుంచి ఎంతో మక్కువ. ప్రాణం కంటే నమ్మిన సిద్ధాంతానికి ప్రాధాన్యత ఇవ్వడంలో ఆయనకు ఆయనే సాటి. నాడు సిపిఎంకు రాజీనామా చేయాలని మావోయిస్టులు తుపాకులతో బెదిరిస్తే ప్రాణమైనా తీసుకుంటాగానీ పార్టీకి రాజీనామా చేయనని ఎదురొడ్డిన ధైర్యశాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వర రామచంద్రపురం మండలంలోని అడవి వెంకన్నగూడెం గ్రామంలో కుంజా జోగయ్య -లచ్చమ్మ దంపతులకు 1926 ఫిబ్రవరి 10న ఆరో సంతానంగా బొజ్జి జన్మించారు. 1948లో లాలమ్మతో వివాహం జరిగింది. భద్రాచలం ఏజెన్సీలో సిపిఎం విస్తరణకు కృషి చేశారు. భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1985లో సిపిఎం అభ్యర్థిగా గెలిచారు. నిరుపేద గిరిజన, గిరిజనేతరుల సమస్యల పరిష్కారం కోసం, కార్మికుల కూలీ పెంపు కోసం ప్రజా ఉద్యమాలు నిర్వహించారు. సిపిఎం నేత సుందరయ్యను ఆదర్శంగా తీసుకుని బొజ్జి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించేవారు. అదేవిధంగా 1989, 1994లోనూ సిపిఎం తరపున పోటీ చేసి హ్యాట్రిక్ విజయం సాధించారు. కనీసం బస్సు సౌకర్యం లేని గ్రామం నుంచి వచ్చిన బొజ్జి కాలినడకనే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. ప్రజల్లో మంచి పేరు గడించారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ సైకిల్‌పైనే కార్యాలయానికి వెళ్లేవారు. సైకిల్‌పైనే తిరుగుతూ ఉండేవారు. బొజ్జికి ఆరుగురు సంతానం కాగా, ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, వారంతా పూరి గుడెసెలోనే జీవించేవారు. బతికున్నంత కాలం ఆదివాసీల పక్షాన నిలిచిన బొజ్జి 2021 ఏప్రిల్ 12న కన్నుమూశారు.

అందరివాడు.. రాజయ్య

భద్రాచలం శాసనసభ్యునిగా మూడుసార్లు పనిచేసి అందరి మన్ననలు పొందిన ఆదివాసీ ముద్దు బిడ్డ సున్నం రాజయ్య కోవిడ్‌తో 2020 ఆగస్టు 3వ తేదీ రాత్రి కన్నుమూశారు. భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధిలో ఆయనది ప్రత్యేక ముద్ర. మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసినప్పటికీ రాజయ్య నిరాడంబరంగా, సామాన్య జీవితం గడుపుతూ అందరికీ ఆదర్శంగా నిలిచారు. సిపిఎం పోరాటాలు, ఉద్యమాలలో తనదైన శైలిలో పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని విఆర్.పురం మండలం సున్నంవారి గూడెంలో 1958 ఆగస్టు 8న కన్నమ్మ, రాజు దంపతులకు రాజయ్య జన్మించారు. పదో తరగతి వరకు చదువుకున్న రాజయ్యకు చుక్కమ్మతో వివాహమైంది. రాజయ్య 1979లో సిపిఎం సభ్యత్వం తీసుకున్నారు. విఆర్.పురం మండలంలోని చిన్నమట్టపల్లి సర్పంచ్‌గా 1988లో విజయం సాధించారు. డివైఎఫ్ఐ భద్రాచలం డివిజన్ కార్యదర్శిగానూ, అధ్యక్షునిగానూ పనిచేశారు. ఏజెన్సీలో యువతను మార్క్సిస్టు పార్టీ వైపు నడిపించడానికి మన్యంలో విల్లంబుల పోటీ, గ్రామీణ క్రీడలైన కబడ్డీ తదితర పోటీలు నిర్వహించి యువతలో సిపిఎం పట్ల అంకితభావం పెరిగేలా కృషి చేశారు. తనకున్న 15 ఎకరాల వ్యవసాయ భూమిని సైతం గిరిజన చిన్నారుల చదువుకోసం ఆశ్రమ పాఠశాల నిర్మాణానికి ఐదెకరాలు, కాలనీ నిర్మాణానికి మరో ఐదెకరాలు, ఊరికి చెరువు కావాల్సి వచ్చినప్పుడు మరో ఐదెకరాలు రాసిచ్చారు. ఇలా సర్వస్వం తమ తమ ప్రాంత ప్రజల ప్రయోజనాలకు దానం చేసిన ఉదారవాది రాజయ్య. భద్రాచలం శాసనసభ్యునిగా రాజయ్య మూడుసార్లు గెలుపొందారు. 1999లో తొలిసారి, ఆ తరువాత 2004, 2014లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2009లో భద్రాచలం నుంచి, 2019లో ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోని రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ఆయన భద్రాచలం ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో బస్సులు, ఆటోల్లో సామాన్యునిలా ప్రయాణించేవారు. నిదానం ఇంటిపేరు, నిలకడ అసలు పేరుగా అనునిత్యం ప్రజల సమస్యలపై పోరాటంచేస్తూ అందరివాడుగా ఉండేవారు. భూ పోరాటాలు, తునికాకు పోరాటాలు, పోలవరం నిర్వాసితుల కోసం మహాపాదయాత్ర, తదితర పోరాటాల్లో రాజయ్య చురుగ్గా పాల్గొన్నారు.

ఐటిడిఎ పాలకమండలిలోనూ, శాసనసభలోనూ అనేక సందర్భాల్లో కోయభాషలోనే మాట్లాడేవారు. ఉద్యమాల కాలంలో 1985లో అమరజీవులు బండారు చంద్రావును, బత్తుల భీష్మారావును హత్యచేసిన సంఘటనలో రాజయ్యపైనా దాడి చేశారు. అయినప్పటికీ ఆయన వెరవలేదు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా రాజయ్య విశేష సేవలందించారు.